PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 115 | 08 శనివారం ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

## డీఎస్సీ లీకేజీపై సీబీఐ విచారణకు

# భయమెందుకు?

**డీఎస్సీ అభ్యర్థులపై దాడులను ఖండిస్తున్నామంటూ జగన్ ప్రకటన**
**లోకేశ్‌ను కాపాడేందుకే ప్రభుత్వం దాడులు చేయిస్తోందని ఆరోపణ**
**డీఎస్సీ లీకేజీ, అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్**
**విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలన్న జగన్**
**విద్యా దీవెన బకాయిలు, నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్**



డీఎస్సీ-2025 ప్రశ్నాపత్రం లీకేజీ, నియామకాల్లో అక్రమాలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్న నిరుద్యోగ యువతపై ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కాపాడేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాన్ని ఇంతగా దిగజార్చుతున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని సూటిగా ప్రశ్నించారు.

మిగతా 2లో...

## రాజమండ్రి ఘటనపై సీఎం చంద్రబాబు

# సీరియస్...



**నిందితులపై కఠిన చర్యలకు ఆదేశం**
**రాజమండ్రి హిట్ అండ్ రన్ ఘటనపై సీఎం చంద్రబాబు సమీక్ష**
**నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం**
**ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన మెడికో ప్రియాంక**
**బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచన**

ఇప్పటికే ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపిన పోలీసులురాజమహేంద్రవరంలో మద్యం మత్తులో యువకులు కారుతో ఢీకొట్టడంతో పీజీ వైద్య విద్యార్థిని బ్రెయిన్ డెడ్ అయిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. తప్పు చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని, వారికి చట్ట ప్రకారం కఠిన శిక్షలు పడేలా చూడాలని స్పష్టం చేశారు. బాధితురాలు డాక్టర్ ప్రియాంక ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ఆమెకు అవసరమైన అత్యుత్తమ వైద్య సహాయం అందించాలని సూచించారు. శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి ఘటనపై సమీక్ష నిర్వహించారు. ఘటన జరిగిన తీరును, నిందితుల అరెస్టు వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన మెడికోలు ప్రియాంక, ఉమేష్‌ల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నిందితులను ఇప్పటికే అరెస్టు చేశామని అధికారులు తెలపగా, విచారణ వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. మిగతా 2లో...



## నేత కార్మికులకు

# అండగా ఉంటాను

**నేడు జాతీయ చేనేత దినోత్సవం**
**నేత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపిన పవన్**
**నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యాఖ్య**

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రంలోని నేత కార్మికులు, కళాకారులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. భారత దేశపు గొప్ప నేత వారసత్వాన్ని సజీవంగా ఉంచుతున్న నైపుణ్యం కలిగిన చేతులకు గౌరవం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ప్రతి చేనేత వస్త్రం మన సంస్కృతికి, చేతిపనితనానికి, స్వావల ంబన స్ఫూర్తికి ప్రతిరూపమని పేర్కొన్న ఆయన, చేనేతను ఎంచుకోవడం ద్వారా మన సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు కార్మికుల జీవనోపాధిని బలోపేతం చేయవచ్చని చెప్పారు. చేనేత రంగా నికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం తనకు గర్వకారణమని వెల్లడించారు.



## రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా మార్చడమే లక్ష్యం

**పికిల్‌బాల్ లీగ్ ప్రారంభోత్సవం**
**ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా నిర్వహిస్తున్న అమరావతి పికిల్‌బాల్ లీగ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజయవాడలోని నైట్రో పికిల్‌బాల్ కేఫే వేదికగా ఈ నెల 9వ తేదీ వరకు ఈ లీగ్ పోటీలు జరగనున్నాయి. రాష్ట్రంలో పికిల్‌బాల్ క్రీడ అభివృద్ధికి ఈ లీగ్ ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు, పికిల్‌బాల్ వంటి నూతన క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి మండిపల్లి అన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎమ్మెల్యే గద్దె రామోహన్నాయుడు, శాప్ చైర్మన్ రవి నాయుడు, సినీహీరో సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి..

# లోకేశ్ రాజీనామా చేయాలి:

**రెండో రోజుకు చేరిన వైసీపీ రిలే నిరాహార దీక్షలు**
**డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగేంత వరకు**
**తమ పోరాటం కొనసాగుతుందన్న అవినాశ్**
**రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని మండిపాటు**



డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలతో వైసీపీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరాయి. విజయవాడ ఆటోనగర్‌లో జరిగిన ఈ దీక్షలో ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మోసపోయిన డీఎస్సీ అభ్యర్థుల న్యాయం కోసం, నిరుద్యోగ యువత హక్కుల కోసం వైసీపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు అనుమతి తీసుకుని శాంతియుతంగా దీక్షలు చేస్తుంటే ఉదయాన్నే 100 మంది పోలీసులు వచ్చి టెంట్లు తీసేశారంటూ దేవినేని అవినాశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో భారత రాజ్యాంగం అమలు కావడం లేదని... చంద్రబాబు, లోకేశ్ ల 'రెడ్ బుక్ రాజ్యాంగం' నడుస్తోందని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణుపై కోడిగుడ్లు, టమాటాలు, యూరిన్ బాటిళ్లతో దాడులు చేయడం అత్యంత దారుణమని ధ్వజమెత్తారు. దమ్ముంటే అక్రమాలపై సీబీఐ విచారణ వేయాలని, మూడేళ్ల తర్వాత టీడీపీ అధికారం కోల్పోవడం ఖాయమని హెచ్చరించిన ఆయన... నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలపై ప్రతి నియోజకవర్గంలో ర్యాలీలు నిర్వహిస్తామని తెలిపారు.



## వైసీపీ దీక్షా శిబిరాలపై దాడులు ప్రజాస్వామ్యాన్ని

# ఖూనీ చేయడమే...

**దీక్షా శిబిరాలపై దాడులు రాజకీయ ఉన్మాదానికి పరాకాష్ఠ అన్న బొత్స**
**వైసీపీ నేతలను అరెస్ట్ చేయడం విచారకరమని వ్యాఖ్య**
**నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్**

డీఎస్సీలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ వైసీపీ చేపడుతున్న రిలే నిరాహార దీక్షా శిబిరాలపై దాడులు చేయించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. విజయవాడలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు నేతృత్వంలోని దీక్షా శిబిరంపై దాడి చేసి టెంట్లు ధ్వంసం చేయడం, కార్యకర్తలు, మహిళలపై రాళ్లు, కోడిగుడ్లతో దాడులు చేయడం రాజకీయ ఉన్మాదానికి పరాకాష్ఠ అని ఆయన వ్యాఖ్యానించారు. దీక్షా శిబిరం టెంట్‌పై మూత్ర విసర్జన చేయడం, మల్లాది విష్ణును వ్యాన్‌లో తరలిస్తుంటే జెండా కర్రతో దాడికి తెగబడటం రాష్ట్రంలో శాంతిభద్రతల క్షీణతకు అద్దం పడుతోందన్నారు.

## హోంమంత్రి అనిత

# రాజీనామా చేయాలి

**దిశ చట్టాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం**
**అనిత డమ్మీ హోంమంత్రి అన్న వరుదు కల్యాణి**
**జగన్ పై కక్షతోనే దిశ చట్టాన్ని రద్దు చేశారని ఆరోపణ**



ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం తీసుకొచ్చిన 'దిశ' చట్టం బిల్లును వెనక్కి తీసుకుంటూ కూటమి ప్రభుత్వం కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడంపై వైసీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నిర్ణయంపై స్పందించిన వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి... హోంమంత్రి అనిత ఒక 'డమ్మీ' హోంమంత్రిగా మారారని తీవ్రస్థాయిలో విమర్శిస్తూ, ఆమె తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం జగన్ పై ఉన్న కక్షతోనే దిశ చట్టాన్ని రద్దు చేశారని ఆరోపించారు. మహిళలకు రక్షణగా నిలిచే దిశ చట్టాన్ని రద్దు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర మహిళలకు క్షమాపణ చెప్పాలని కల్యాణి డిమాండ్ చేశారు. కావాలంటే చట్టం పేరు మార్చినా తమకు అభ్యంతరం లేదని, కానీ మహిళల రక్షణ కోసం ఆ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని కోరారు. ఈ వార్త మీకు నచ్చిందా?.. నచ్చిన వార్తలను మీ మిత్రులతో కూడా పంచుకోండి

ప్రజాసీమ

# చట్టం చేస్తున్నాం...

## బీసీలకు సంరక్షణ కల్పిస్తాం

మొదటిపేజీ తరువాయి




చీరాల, ఆగస్టు 7 ( ప్రజాక్రాంతి): బీసీల సంరక్షణను చేపట్టే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని... దీనికోసం త్వరలోనే చట్టం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బీసీ సంరక్షణ చట్టం కోసం ముసాయిదా సిద్ధమైందని వెల్లడించారు. శుక్రవారం 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలోని కొత్తపేట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నేతన్న సేవలో సంక్షేమ పథకాన్ని సీఎం ప్రారంభించారు. రాష్ట్రంలోని

# భయపడొద్దు, నేనున్నాను... టీఎంసీ-శివసేన రెబల్స్‌కు ప్రధాని మోదీ భరోసా

ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీయేలోని నూతన మిత్రపక్షాలకు, ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (ఉద్ధవ్ వర్గం) నుంచి వచ్చిన రెబల్ ఎంపీలకు కీలక భరోసా ఇచ్చారు. "ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, నేను మీకు అండగా ఉంటాను" అని ఆయన అభయమిచ్చారు. శుక్రవారం ఉదయం తన నివాసంలో సుమారు 45 మంది ఎన్డీయే ఎంపీలతో ఏర్పాటు చేసిన అల్పాహార సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు పదేపదే అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో తృణమూల్ రెబల్స్‌తో ఏర్పడిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ), ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరిన శివసేన ఎంపీలు, ఎన్సీపీ (అజిత్ పవార్) సభ్యులు పాల్గొన్నారు. సభలో గందరగోళం కారణంగా కొత్త ఎంపీలకు మాట్లాడే అవకాశం రాకపోవడం అన్యాయమని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. పార్లమెంటు చరిత్రను అధ్యయనం చేసి, చర్చలకు సిద్ధం కావాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం పురోగమిస్తుందని పేర్కొంటూ, తమ నియోజకవర్గాల అభివృద్ధి పనుల నిమిత్తం నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. "ఎన్డీయే ఒక కుటుంబం. కూటమిలోని ప్రతి పార్టీకి, ప్రతి ఎంపీకి తగిన గౌరవం ఉంటుంది. నేను ప్రతి ఎంపీకి అండగా ఉంటాను" అని మోదీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడారు. ముఖ్యంగా మహారాష్ట్రకు చెందిన షిండే వర్గం ఎంపీలతో మరాఠీలో సంభాషించడం విశేషం.

# హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్ నిర్మాణం

మొదటిపేజీ తరువాయి

నగర శివారులోని గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి భూమి కేటాయించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రకటించారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణం పూర్తయితే నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. జగద్గిరిగుట్ట సమీపంలో బస్ డిపో నిర్మాణం కోసం టీజీఎస్ఆర్టీసీ గతంలో హెచ్ఎంటీకి చెందిన స్థలాన్ని 99 ఏళ్ల పాటు లీజుకు కోరినట్లు తెలిపారు. అయితే, కేవలం 20 ఏళ్లకు మాత్రమే లీజుకు ఇవ్వగలమని, అదీ ఐదేళ్లకోసారి సమీక్షిస్తామని హెచ్ఎంటీ అధికారులు చెప్పారన్నారు. దీనికి అదనంగా ఏటా రూ.6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలని షరతు విధించడంతో ఈ ప్రతిపాదనను టీజీఎస్ఆర్టీసీ తిరస్కరించిందని గడ్కరీ వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో హెచ్ఎంటీ భూములకు సమీపంలోనే 100 ఎకరాల స్థలాన్ని టీజీఎస్ఆర్టీసీకి కేటాయించిందని గడ్కరీ స్పష్టం చేశారు. ప్రస్తుతం జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు రోజూ 404 ట్రిప్పులు నడుపుతున్నాయని, కొత్త డిపోతో ఈ ప్రాంతంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపాదిత గాజులరామారం డిపోను అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సుల కోసం ప్రత్యేకంగా ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్, సిటీ బస్సుల కోసం మరో టెర్మినల్ ఏర్పాటు చేస్తారు. పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సహించేందుకు ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక ఛార్జింగ్ స్టేషన్‌ను కూడా నిర్మించనున్నారు. ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులు నగరం నడిబొడ్డుకు రాకుండా ఇక్కడి నుంచే తమ సర్వీసులను నడుపుతాయి. తద్వారా ఎంజీబీఎస్, జేబీఎస్ వంటి బస్టాండ్లపై ఒత్తిడి తగ్గి, నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించగలదని ప్రభుత్వం భావిస్తోంది.

# జెన్-జీ పై మోహన్ భగవత్ వ్యాఖ్యలు...

మొదటిపేజీ తరువాయి

ముంబైలో జెన్-జీ, జెన్-ఆల్ఫా విద్యార్థులతో జరిగిన కార్యక్రమంలో మోహన్ భగవత్ చేసిన ప్రసంగాన్ని ఈ సందర్భంగా దీప్కే ప్రస్తావించారు. "నిరసనలు తెలుపుతున్న జెన్-జీ యువత దేశ వ్యతిరేకులు కాదు, వారి ఆందోళనల్లో నిజాయతీ ఉంది, వారికి నిరసన తెలిపే హక్కు ఉంది" అని మోహన్ భగవత్ స్పష్టం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బీజేపీకి మార్గదర్శిగా ఉన్న భగవత్ మాటలను ఆ పార్టీ నాయకత్వం వినాలని హితవు పలికారు. గతంలో జంతర్ మంతర్ వద్ద నిరసనలు జరిగినప్పుడు బీజేపీ నేత నితిన్ నబిన్ ఆందోళనకారులను 'వైరస్' అని, కేంద్ర మాజీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 'ఉగ్రవాదుల బీ టీమ్' అని వ్యాఖ్యానించిన విషయాన్ని అభిజిత్ దీప్కే గుర్తు చేశారు. వారి మార్గదర్శి మాటలనే బీజేపీ నేతలు ఖాతరు చేయకపోవడం సరికాదని ఆయన అన్నారు. ఈ అంశంపై మోహన్ భగవత్ నేరుగా బీజేపీ నాయకత్వంతో మాట్లాడాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ భిన్నమైన వైఖరులు విస్తృత సంఘ్ పరివార్‌లో ఉన్న అంతర్గత విభేదాలను సూచిస్తున్నాయని అభిజిత్ దీప్కే పేర్కొన్నారు. తమ పార్టీ ఏ రాజకీయ భావజాలానికి కట్టుబడి ఉండదని, కేవలం దేశం, యువతకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే బృందంగా పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# అధికారులు సమన్వయంతో పని చేస్తూ మండలాభివృద్ధిని వేగవంతం చేయాలి





-ప్రజల అవసరాలకు అనుగుణంగా శాఖల వారీగా కార్యాచరణ రూపొందించాలి

-వ్యవసాయం నుంచి తాగునీటి వరకు ప్రతి సేవలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి

-పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

-మంథని మండల సర్వసభ్య సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

మంథని ప్రతినిధి, ప్రజాక్రాంతి, ఆగస్టు 07:

మంథని మండలంలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు పూర్తి స్థాయిలో చేరేలా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ మండలాభివృద్ధిని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం మంథని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వ్యవసాయం, వైద్యం, విద్య, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, ఐసీడీఎస్, విద్యుత్, ఉద్యానవనం, రవాణా, నీటిపారుదల, ఆర్ అండ్ బీ తదితర శాఖల అమలు చేస్తున్న కార్యక్రమాల పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ వీబీజీ--రామ్‌జీ పథకం కింద చేపడుతున్న జలసిరి కార్యక్రమం, ఇంకుడు గుంతలు, పంటకుంటలు, ఇతర సహజ వనరుల అభివృద్ధి పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసి గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, రైతులకు క్షేత్రస్థాయిలో సాంకేతిక సలహాలు అందించాలని తెలిపారు. యూరియా పంపిణీ పారదర్శకంగా జరిగేలా పర్యవేక్షించడంతో పాటు సేంద్రియ సాగు విధానాలపై రైతులను మరింతగా ప్రోత్సహించాలని సూచించారు. మిషన్ భగీరథ పరిధిలో నీటి సరఫరా వ్యవస్థలో ఉన్న సమస్యలను గ్రామాల వారీగా గుర్తించి, శాశ్వత పరిష్కారాల కోసం సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా ఎక్కడా నిలిచిపోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రతి వైద్యాధికారికి ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ అధికారులు గ్రామాల్లో విద్యుత్ అంతరాయాలు తగ్గించేలా నిర్వహణ పనులు చేపట్టాలని, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లను ఆలస్యం చేయకుండా మరమ్మతు చేయడం లేదా అవసరమైతే కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను శాఖల అధికారులు కేవలం నమోదు చేయడానికే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో అధికారులు తరచూ పర్యటించడం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలపై మరింత విశ్వాసం కల్పించవచ్చని ఆయన అన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి పూర్ణచందర్ ఈఈ గ్రిడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జి కొత్త శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సలహా మండలి సభ్యుడు శశిభూషణ్ కాచే, జిల్లా ఆర్టీఏ సభ్యుడు మంథని సురేష్ , ఎంపీడీవో శ్రీజ రెడ్డి, తహసీల్దార్ ఆరిపుద్దీన్, వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జీఐ ట్యాగ్‌తో కుప్పడం పట్టుకు మరింత విశిష్టత

మొదటిపేజీ తరువాయి

కుప్పడం పట్టు చీరల ప్రత్యేకత, సంప్రదాయ నేత వృత్తి నైపుణ్యం, మార్కెట్ పరిస్థితులపై వారితో చర్చించారు. ప్రభుత్వ సాయం మాకు కొండంత అండ : చేనేత కార్మికులుచేనేతల జీవనోపాధి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై చేనేత వర్క్‌షాప్‌లోని కార్మికులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. వర్క్‌షాప్ ఏర్పాటుకు దారితీసిన ఆలోచన, యూనిట్ స్థాపన, ఎదురైన సవాళ్లు, వాటిని అధిగమించి తీర్చిదిద్దిన తీరు, యూనిట్ ను సమర్థంగా నడిపిస్తున్న అంశాన్ని వారు సీఎంకు వివరించారు. ముందుగా కంచి బోర్డర్ చీరల తయారీ దారు బత్తా ధనుంజయరావుతో ముఖ్యమంత్రి మాట్లాడారు. కుటుంబ పరిస్థితులు, చేనేత వృత్తి, ఉత్పత్తి వ్యయం, ఆదాయం, మార్కెటింగ్, విక్రయాల గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఎంతో ఉపయోగపడుతోందని, రూ.25 వేల ఆర్థిక సాయం తమకు ప్రోత్సాహంగా ఉంటుందని వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి బండారు బాలసుబ్రహ్మణ్యంతో కలిసి వర్క్‌షాప్ లోని తొలి అంతస్తును పరిశీలించారు. భవనాన్ని విస్తరించి మరిన్ని మగ్గాలు ఏర్పాటు చేసి మరింత మంది చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలన్న ప్రణాళికలను ఆయన సీఎంకు వివరించారు. కోవిడ్ కారణంగా నిలిచిపోయిన విస్తరణ పనులను తిరిగి ప్రారంభించ నున్నట్లు తెలిపారు. అనంతరం వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న ఇతర చేనేత కార్మికులతో ముఖ్యమంత్రి ముచ్చటించారు. బొడ్డు అరుణ అనే మహిళ మగ్గం పై చీర నేస్తున్న తీరును సీఎం ఆసక్తిగా పరిశీలించారు. ప్రభుత్వం అందించిన రూ.25 వేల ఆర్థిక సాయం తమ బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు మొబైల్ ఫోన్లలో వచ్చిన సంక్షిప్త సందేశాన్ని కార్మికులు ముఖ్యమంత్రికి చూపించారు. ప్రభుత్వ సహకారంతో తమ జీవనోపాధికి భరోసా లభించిందని చేనేతలు సంతోషం వ్యక్తం చేశారు.

# పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఘన సత్కారం






పిఠాపురం (ప్రజా సీమ )

పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ పిఠాపురం మండలం చిత్రాడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీ రామనామ ప్రచార సంస్థ, పెరాట్ల సుబ్రహ్మణ్యం చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఘన సత్కార కార్యక్రమం నిర్వహించారు. 2024--25, 2025--26 విద్యా సంవత్సరాల్లో పదో తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, షీల్డ్‌లు, జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. అలాగే ప్రథమ స్థానం సాధించిన బాలుడు, బాలికలకు నగదు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి పిరాట్ల వెంకట సూర్యనారాయణ మాట్లాడుతూ, తనికెళ్ల విజయ రాఘవమూర్తి అధ్యక్షతన నిర్వహిస్తున్న శ్రీ రామనామ ప్రచార సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక, ధార్మిక, విద్యా సేవా కార్యక్రమాల్లో భాగంగా చిత్రాడ జడ్పీ హైస్కూల్లో గత 18 సంవత్సరాలుగా ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా 500కు పైగా మార్కులు సాధించే విద్యార్థులందరికీ ప్రోత్సాహక పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమానికి డిప్యూటీ ఈవో కె.వి.వి. సత్యనారాయణ అధ్యక్షత వహించగా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. వసంత కుమారి, ఉపాధ్యాయ సిబ్బంది, శ్రీ రామనామ ప్రచార సంస్థ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ పి. లక్ష్మి అరుణ, గ్రామ పెద్దలు రావు వెంకట మహేశ్వరరావు, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించి ప్రోత్సహించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు సంస్థ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు.

# తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానం

## -9వ వార్డు కౌన్సిలర్ మార్వాక నిహారిక

మంథని ప్రతినిధి, ప్రజాక్రాంతి, ఆగస్టు 07:

తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానమని, పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వలన శిశువులలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని మంథని 9వ వార్డు కౌన్సిలర్ మార్వాక నిహారిక తెలిపారు. మంథని పట్టణంలోని 9వ వార్డులో పరిధిలోని అంగన్వాడి 1వ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను, ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 9 వ వార్డు కౌన్సిలర్ మార్వాక నిహారిక ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నిహారిక మాట్లాడుతూ బాలింతలకు గర్భిణీలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. శిశువు శారీరక మానసిక ఎదుగుదలకు తల్లిపాలుఎంతో దోహదపడుతాయని, అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ కల్పిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు శారద, ఉదయ, రాజమణి , గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.



# రైతన్న మీకోసం బి ఎల్ ని నో ప్రభావ నివారణ కార్య చరణ ప్రణాళిక

## స్టేట్ డైరెక్టర్ డాక్టర్ నాగూరు వీరభద్రుడు

**సిద్ధవటం (ప్రజా సీమ)**

సిద్ధవటం మండలం లోని మాధవరం వన్ గ్రామంలో రైతు సేవ కేంద్రాలలో 2026 ఖరీఫ్ సీజన్లో నెలకొన్న ఎల్ ని నో పరిస్థితులు దృశ్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా రైతన్న మీకోసం ఎల్ .ని నో ప్రభావ నివారణ కార్యచరణ ప్రణాళిక పేరుతో సమగ్ర క్షేత్ర సాయి ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని చేయాలని నిర్ణయించింది అని ఏపీ స్టేట్ నూరు బాషా దూదేకుల కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ నాగూర్ వీరభద్రుడు అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ లో వేసే పంటలకు వర్షం తక్కువగా ఉండడం చేత కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తొందరపడి నీళ్ళ మీద ఆధారపడే పంటలు వేయొద్దని వేసిన పంటలకు బీమా పథకాన్ని రిజిస్టర్ చేయించుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో అగ్రికల్చరల్ అసిస్టెంట్ మౌనిక రెడ్డి పంచాయతీ సిబ్బంది రైతులు పాల్గొన్నారు



# మదనపల్లె జిల్లా కేంద్రమా లేక అసెంబ్లీ కేంద్రమా..?

## - బీవైఎస్ అధ్యక్షులు పునీత్ కుమార్ సందేహం

**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లె జిల్లా కేంద్రమా లేక అసెంబ్లీ కేంద్రమా అని బీవైఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పునీత్ కుమార్ సందేహం వ్యక్తం చేశారు.బహుజన యువసేన (బీవైఎస్) కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు పునీత్ కుమార్ కీలక ప్రశ్నలు లేవనెత్తారు.అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లెగా ప్రకటించి దాదాపు 9 నెలలు గడిచినా,ఇప్పటికీ అనేక జిల్లాస్థాయి కార్యాలయాలు మదనపల్లెలో పూర్తిస్థాయిలో పనిచేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు.ఆర్టీసీ జిల్లా కార్యాలయం ఇప్పటికీ రాయచోటిలోనే కొనసాగుతుండగా,ఆర్టీఓ జిల్లా కార్యాలయాన్ని కూడా రాయచోటికి తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని,బీసీ హాస్టల్ను సైతం రాయచోటికి తరలించే చర్యలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.దాదాపు 20–25 జిల్లా స్థాయి కార్యాలయాలు మదనపల్లెలో లేకపోవడం ఆందోళనకరమన్నారు.అంతేకాకుండా మదనపల్లెలో ఉన్న కొన్ని జిల్లా కార్యాలయాలకు అధికారులు రోజూ హాజరు కాకుండా వారానికి ఒకసారి మాత్రమే రావడం,మరికొందరు అధికారులు రాయచోటిలోనే విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతున్నాయన్నారు.మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించింది పరిపాలన కోసం అయితే,జిల్లాస్థాయి కార్యాలయాలు రాయచోటిలో ఎందుకు,మదనపల్లె జిల్లా కేంద్రమా లేక కేవలం అసెంబ్లీ కేంద్రమా అని పునీత్ కుమార్ సూటిగా ప్రశ్నించారు.జిల్లా కేంద్రంగా మదనపల్లెలో అన్ని జిల్లా స్థాయి కార్యాలయాలను ఏర్పాటు చేసి,అధికారులు క్రమం తప్పకుండా విధులకు హాజరయ్యేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



# ఆర్యవైశ్య మహాసభలో రాజంపేటకు కీలక పదవి

## రాజంపేటకు చెందిన పాలెంపల్లి కార్తీక్‌కు అరుదైన గౌరవం

**రాజంపేట (ప్రజా సీమ):**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ / జిల్లా ఆర్యవైశ్య సంఘం (రూరల్) కార్యదర్శిగా రాజంపేటకు చెందిన పాలెంపల్లి కార్తీక్ నియమితులయ్యారు. ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి, సంఘ సభ్యుల సంక్షేమానికి కృషి చేయడంతో పాటు సమాజ సేవలో చురుకైన పాత్ర పోషిస్తున్న కార్తీక్‌ను కార్యదర్శి బాధ్యతలకు ఎంపిక చేయడం పట్ల ఆర్యవైశ్య సంఘం నాయకులు, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా ఆర్యవైశ్య మహాసభ నాయకులకు కార్తీక్ కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆర్యవైశ్య సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. కార్తీక్ నియామకం పట్ల రాజంపేటకు చెందిన పలువురు ప్రముఖులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు అభినందనలు తెలిపారు



# వెంకటగిరిలో అంగరంగ వైభవంగా శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక వార్షికోత్సవం

## సామాజిక ఐక్యత -- విద్యా సేవలు -- ఉచిత వైద్య సేవలకు రాధా రంగ మిత్ర మండలి కట్టుబాటు

**వెంకటగిరి ప్రజా సీమ**

తిరుపతి జిల్లా, వెంకటగిరి పట్టణంలో రాధా రంగ మిత్ర మండలి ఆధ్వర్యంలో విజయనగర సామ్రాజ్య మహా చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల వారి పట్టాభిషేక వార్షికోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా, ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వచ్చిన బలిజ సోదరులు, సామాజిక నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.తెలుగు రెండు రాష్ట్రాల రాధా రంగ మిత్ర మండలి అధ్యక్షులు లిబులెట్ ధర్మరావులి ఆదేశాల మేరకు, రాధా రంగ మిత్ర మండలి తిరుపతి పార్లమెంట్ ఇన్‌చార్జి లిగుణకల ధనుంజయులు, వెంకటగిరి నియోజకవర్గ అధ్యక్షులు లిలివయ్యావూరు మణిలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకటగిరి పట్టణంతో పాటు బాలాయపల్లి, డక్కిలి, రాపూరు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో బలిజ సంఘ నాయకులు, యువత, మహిళలు, సామాజిక కార్యకర్తలు హాజరై శ్రీకృష్ణదేవరాయల సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమం మొత్తం సామాజిక చైతన్యం, సాంస్కృతిక వైభవం, ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.కాపు, బలిజ, ఒంటరి, తెలగ కులాలను బీసీ జాబితాలో చేర్చాలని చిత్తూరు నుంచి అమరావతి వరకు పాదయాత్ర నిర్వహించిన సామాజిక ఉద్యమకారుడు లిసాన ప్రసాద్ నాయుడులి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి విద్య, ఉపాధి, ఆరోగ్యం మూడు ప్రధాన స్తంభాలని పేర్కొన్నారు.రాధా రంగ మిత్ర మండలి తరఫున పలు కీలక నిర్ణయాలు ప్రకటించారు. ప్రతి సంవత్సరం శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక మహోత్సవాన్ని మరింత వైభవంగా నిర్వహించడంతో పాటు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు లిఉచిత సాఫ్ట్‌వేర్ కోర్సులులి అందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే నిరుపేద ప్రజలకు లిఉచిత కంటి పరీక్షలు, కంటి ఆపరేషన్లులి నిర్వహించి ఆరోగ్య సేవలను అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు లిఅంజూరి చిరంజీవి, లిలిఅనిల్, లిలిరామారావు, లిలిగుడి సురేంద్ర, లిలిజిల్లెల రాజేష్, టీడీపీ నాయకులు లిలిగొల్లగుంట వెంకటముని,



లిలిగొల్లగుంట రాము, బలిజ సంఘ నాయకులు లిలిఅడ్వకేట్ గుండు మనోజ్, లిలిరిటైర్డ్ టీచర్ జ్యోతీశ్వర్ రావు, లిలిదశయ్య, లిలినర్రా రవి, లిలిసుంకర రవి, లిలికృష్ణకుమార్ పెట్టేం, లిలికాసారం ఓంకార్, రాధా రంగ మిత్ర మండలి సభ్యులు లిలిచింతల రాజేష్, లిలిధనుంజయులు, లిలివి. ప్రసాద్‌లి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.శ్రీకృష్ణదేవరాయల ఆదర్శాలను భావితరాలకు చేరవేయడంతో పాటు, బలిజ సమాజ ఐక్యత, విద్యా అభివృద్ధి, సామాజిక సంక్షేమం, సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు రాధా రంగ మిత్ర మండలి నిరంతరం కృషి చేస్తుందని నాయకులు స్పష్టం చేశారు.

# యువతా మేలుకో- మత్తు నుండి తేరుకో







## డ్రగ్స్ వద్దు - జీవితం ముద్దు

**సిద్ధవటం (ప్రజా సీమ)**

మండలంలోని జెయంజె జూనియర్ కళాశాల మరియు హైస్కూల్, కనుములోపల్లి, సిద్ధవటం నందు "పోలీస్ కళా–జాగృతి బృందం" నాటక ప్రదర్శన వైయస్సార్ కడప జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ శ్రీ సెల్కే నచ్చికేత్ విశ్వనాథ్, ఐ.పి.ఎస్‌లి వారి ఆదేశాల మేరకు, శుక్రవారం సాయంత్రం జెయంజె జూనియర్ కళాశాల మరియు హైస్కూల్, కనుములోపల్లి, సిద్ధవటం మండలం నందు పోలీస్–కళా–జాగృతి బృందం ఇన్‌చార్జ్ జి. నరసరామ్ మరియు బృందము వారిచేత "ఓయువతా – మేలుకో" పాటలు, నాటిక ప్రదర్శన ద్వారా మాధకద్రవ్యాలపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించినారు.ఈ సందర్భంగా కడప ఫ్యాక్షన్ జోన్ ఎస్.ఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నేటి సమాజంలో యువత "డ్రగ్స్" కు దూరంగా ఉండి వారి భవిష్యత్తును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మత్తుపదార్థాలు వాడిన, అమ్మిన, ఆశ్రయం కల్పించిన వాటికి తగిన శిక్షలు గురించి తెలియజేశారు.మత్తు పదార్థాల ఆచూకీ తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972 కి కాల్ చేసి తెలియజేయాలన్నారు.జేఎంజె జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లిల్లీ పుష్ప మాట్లాడుతూ మత్తుపదార్థాల వాడకంవల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు, సమాజంలోని రుగ్మతలు వాటివలన కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థినీ విద్యార్థుల గురించి ఆమె మాట్లాడుతూ మీ తల్లిదండ్రులు మీ పై పెట్టుకున్న ఆశలను నెరవేర్చి సమాజానికి ఉపయోగ పడాలని వారికి తెలియపరిచినారు.ఈగల్ టీమ్ ఇంచార్జ్ గురుశేఖర్ విద్యార్థులచే "యువతా మేలుకో– మత్తు నుండి తేరుకో, డ్రగ్స్ వద్దు – జీవితం ముద్దు – మత్తుపదార్థాలకు దూరంగా ఉందాం – భవిష్యత్తును కాపాడుకుందాం" అని విద్యార్థినీ విద్యార్థులచే నినాదాలు చేయించినారు."పోలీసు కళా–జాగృతి బృందం" వారు నాటిక ద్వారా పాటల ద్వారా మాదకద్రవ్యాల వలన జరిగే అనర్థాల గురించి ఇచ్చిన ప్రదర్శన విద్యార్థులనం అలరించింది.ఈకార్యక్రమంలో జెయంజి జూనియర్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు మరియు కళాబృందం సభ్యులు సుశీల, మేషక్, ఉదయ్, శ్రీరామ్, మధు, కరుణాకర్ పాల్గొన్నారు.

# ఇంటింటా తెలుగుదేశంపై బూత్ ఇన్‌చార్జిలకు అవగాహన

## గొల్లప్రోలు టీడీపీ కార్యాలయంలో కార్యక్రమం.. చేనేత కార్మికులకు శుభాకాంక్షలు

**కాకినాడ జిల్లా (ప్రజా సీమ )**

గొల్లప్రోలు, తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు చేపట్టిన 'ఇంటింటా తెలుగుదేశం' కార్యక్రమంపై బూత్ ఇన్‌చార్జిలకు అవగాహన కార్యక్రమాన్ని గొల్లప్రోలు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు గుంట్ర సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జిలకు కార్యక్రమం నిర్వహణ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి కార్యకర్తల పాత్ర కీలకమని అన్నారు. ప్రతి ఇంటినీ సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు.అనంతరం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చేనేత రంగం అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందించాలని ఆకాంక్షించారు. చేనేత కార్మికులకు జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమం అనంతరం టీడీపీ కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జిలతో పార్టీకి సంబంధించిన పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు.



# ఆధ్యాత్మిక వాతావరణంలో ఆడి కృతిక వేడుకలు

## - పాల్గొన్న తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

ఆడికృతిక పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం చిప్పిలి గ్రామంలో వెలసిన మడికయ్యల శివాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడికృత్తిక ఎంతో పవిత్రమైన రోజు అని,ప్రజలు భక్తిశ్రద్ధలతో ఈ వేడుకను నిర్వహించుకుంటారన్నారు.స్వామివారి కృపాకటాక్షలతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక ఆశీర్వచనం అందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొప్పుల వెంకటరమణ,పాలకమండలి సభ్యులు పసుపులేటి వరప్రసాద్,కలిశం ప్రకాష్ నాయుడు,నరసింహమూర్తిశివ కుమార్,మల్లిక,సిద్దయ్య స్థానిక నాయకులు,భక్తులు,కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



# ఇంటింటికి తెలుగుదేశంతో ప్రజాసమస్యల పరిష్కారం





### - ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా స్పష్టం

### - ఎమ్మెల్యేకి ఘనస్వాగతం పలికిన ఎస్.ఏ మస్తాన్,నస్రీన్ తాజ్

**మదనపల్లె (ప్రజా సీమ) :**

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రజల వద్దకే ప్రజా ప్రతినిధులు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం సులువైన వేదికగా అని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లి మున్సిపల్ పరిధిలోని 12,13 వార్డుల పరిధిలో స్థానిక తెలుగుదేశం పార్టీ నేతలతో కలిసి పర్యటించారు. ఇంటింటా తిరుగుతూ కూటమి ప్రభుత్వ పాలన ఏర్పడి రెండున్నర ఏళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను సంక్షేమ పథకాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరిస్తూ, ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించే దిశగా అధికారులతో సమీక్షిస్తూ ముందుకు సాగారు. వాటిల్లో నెలకొన్న డ్రైనేజీ,త్రాగునీటి,వీధిలైట్లు,పెన్షన్లు,హౌసింగ్ సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకుంటూ సంబంధిత అధికారులతో సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. 12వ వార్డు ఇన్చార్జులు గిరీష్,చిన్న మహేష్,13వ వార్డులో ఎస్.ఏ మస్తాన్ దంపతులు ఎమ్మెల్యే వెంట ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండేళ్ల ప్రజా పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ సంతోషమైన పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. వార్డులలో నెలకొన్న ప్రజా సమస్యలను తక్షణ పరిష్కరించే దిశగా ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం ఎంతగానో ఉపయోగ పడుతో ందన్నారు. ఎన్.వి.ఆర్ లేఔట్లో రోడ్డును ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం 13వ వార్డు ఇంచార్జి నస్రీన్ తాజ్,ఎస్.ఏ మస్తాన్ మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు తన అనుభవంతో రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నారని ప్రశంసించారు. అదేవిధంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మదనపల్లి పట్టణ నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాదెళ్ల విద్యాసాగర్, మల్లికార్జున నాయుడు, దొరస్వామి నాయుడు,దాదు, రమేష్ రెడ్డి,రామిశెట్టి కృష్ణ (కమలామద్రి),శ్రీరామ వినోద్,నవీన్ చౌదరి,సచివాలయ సిబ్బంది,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి భూముల్లో ప్రత్యామ్నాయ పంటలు వేయాలి






### -రైతులు ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి.. --పంటల భీమా గడువు ఈ నెల 15

### -తాటిపర్తిలో 'రైతన్న మీకోసం' కార్యక్రమంలో జేసీ అపూర్వ భారత్

**కాకినాడ జిల్లా (ప్రజా సీమ )**

గొల్లప్రోలు మండలం తాటిపర్తి,నీటి లభ్యతను బట్టి పంటల సాగు చేపట్టాలని, నీటి ఎద్దడి ఉన్న భూముల్లో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ అపూర్వ భారత్ రైతులకు సూచించారు. శుక్రవారం తాటిపర్తిలో నిర్వహించిన 'రైతన్న మీకోసం' కార్యక్రమానికి ఆమె హాజరై రైతులతో మాట్లాడారు. నవధాన్యాలు (పీఎండీఎస్), ఉద్యాన పంటలు, ప్రత్తి తదితర పంటల్లో నవధాన్యాలను వినియోగించాలని, ఎరువుల వాడకాన్ని తగ్గించి, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్ మాట్లాడుతూ తక్కువ నీటితో, తక్కువ కాలంలో దిగుబడినిచ్చే వరి విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నీటి ఎద్దడి ఉండే భూముల్లో మొక్కజొన్న, జొన్న, రాగులు, పెసర, మినుము, కూరగాయల వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు.

**ఈ నెల 15లోగా బీమా చెల్లించాలి**

పిఠాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పి. స్వాతి మాట్లాడుతూ వరి పంటకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటల బీమా చెల్లింపునకు ఈ నెల 15వ తేదీ తుది గడువని తెలిపారు. రైతులు ఎకరాకు రూ.760 చొప్పున మీ-సేవ కేంద్రం లేదా బ్యాంకులో బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కరపత్రాలతో పాటు 'రైతన్న మీకోసం' కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను జేసీ అపూర్వ భారత్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి వై. సోమరాజు శేఖర్, మండల వ్యవసాయ అధికారి కె.వి.వి. సత్యనారాయణ, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# డీఎస్సీ అభ్యర్థులు,నిరుద్యోగుల పక్షాన పోరాటం కొనసాగిస్తాం





### - వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ స్పష్టం

### - రిలే నిరాహార దీక్షకు హాజరైన మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

డీఎస్సీ అభ్యర్థులు,నిరుద్యోగులు,యువత,విద్యార్థుల పక్షాన వైఎస్ఆర్సిపి పోరాటం చేస్తుందని మదనపల్లి వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ పేర్కొన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఏపీ ప్రభుత్వం నిర్వహించిన క్యాబినెట్ సమావేశాలకు ఎందుకు హజరు కావడం లేదని,సిఎం చంద్రబాబునాయుడు,మంత్రి నారా లోకేష్ చేసే అవకతవకలు తెలిసే దూరంగా వున్నారా అనే సందేహాలను ఆయన వెల్లిబుచ్చారు. మదనపల్లె టౌన్ అవెన్యూ రోడ్డు వైయస్సార్ సిపి కార్యాలయం వద్ద వైయస్సార్సిపి యువజన విభాగం,విద్యార్థి విభాగం,నిరుద్యోగ యువత,డిఎస్సీ అభ్యర్థులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలకు రెండవ రోజైన శుక్రవారం ఎస్.నిస్సార్ అహమ్మద్ మద్దతు ప్రకటించి,దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం సిఎం చంద్రబాబునాయుడు అధ్యక్షత జరిగిన క్యాబినెట్ భేటీకి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఎందుకు రాలేదని నిలదీశారు. నాలుగు క్యాబినెట్ మీటింగులలో రెండు మీటింగుల నుండి అర్ధంతరంగా వెళ్లిపోయిన పవన్ కళ్యాణ్,మరో రెండు క్యాబినెట్ మీటింగులకు రాకపోవడంలో,దీంతో ఆయన వరుసగా రెండు క్యాబినెట్ సమావేశాలకు గైర్హాజరు అయినట్లు అయిందని,దీనిపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఇటీవల ప్రధాని హాజరైన భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవంతోపాటు పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్న డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పాల్గొన్నారని గుర్తు చేశారు. అనారోగ్యమే కారణమని ఆ పార్టీ నాయకులు చెబుతున్నా లోలోపల ఏదో జరుగుతోందని,డిఎస్సీ అక్రమాలే కారణమా అంటూ ప్రశ్నించారు .నిరుద్యోగులుడిఎస్సీ అభ్యర్థులు,యువత ఇంటింటికీ వచ్చే టీడీపీ నాయకులు,ఎమ్మెల్యేలను నిలదీయాలని వైయస్సార్సిపి మదనపల్లె సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్,మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి పిలుపునిచ్చారు. నిరుద్యోగుల కు రెండున్నర సంవత్సరాలుగా నిరుద్యోగ భృతి ఇవ్వలేదని,ఇప్పటి నుంచి ఇప్పటి వరకు అరియార్స్ తో సహా చెల్లించాలని నిలదీయండని సూచించారు. ప్రతి డిఎస్సీ అభ్యర్థి,తమకు జరిగిన అన్యాయంపై ప్రశ్నించాలని కోరారు. రిలే నిరసన దీక్షలలో నిజంగా నష్టపోయిన డిఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారని వారిని సభ ముఖంగా చూపించారు. అనంతరం విద్యార్థి విభాగం స్టేట్ జాయింట్ సెక్రెటరీ హేమంత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం సంవత్సరాలుగా శ్రమిస్తున్న యువతను నిరాశకు గురిచేసే చర్యలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదన్నారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు పార్టీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. దీనిపై సీబీఐ విచారణ చేపట్టాలని,మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వివిఎస్ రెడ్డి,పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్కె ఇర్ఫాన్,విద్యార్థి విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ హేమంత్ కుమార్,నాయకులు పవన్ రాయల్,జిల్లా కౌన్సిల్ మెంబెర్ గుడిటి చరణ్,రామసముద్రం మండల కన్వీనర్ కేశవ రెడ్డి,బాలాజీ,రాధాకృష్ణ రెడ్డి,లియాఖత్ అలీ ,కోటూరు ఈశ్వర్, గ్రానైట్ మహేశ్, నూర్ మొహమ్మద్ ఖాన్,నాసీర్, ఫిరోజ్,పోతబోలు నాగరాజ ,ఈశ్వర్ నాయక్,బయ్యారెడ్డి,ఎన్.నవాజ్ అలీ ఖాన్,చెన్న కృష్ణ,నవీన్,అరుణ్,బీరంగి రేవతి,మేరీ ,శారదా రెడ్డి,నాగమణి, మంజుల ,ఫిరోజ్ నాయబ్,యూనస్, నాగరాజ రెడ్డి,తాళే సుబ్రమణ్యం,షేక్ జబి,తాజ్ బాషా (క్వాలిటీ నట్స్),మాధవరెడ్డి సాంబశివారెడ్డి,ఆవుల సోమశేఖర్ రెడ్డి,ఆవుల విశ్వనాథ్ ,చీకలబైలు చంద్ర,చలపతి,సత్తార్,జైనుల్లా,ఫక్రుద్దీన్,సమద్,సాధిక్ మరియు వైఎస్సార్సీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా, పొన్నమాండ లక్ష్మణస్వామి వర్మ జయంతి వేడుకలు

**సిద్ధవటం( ప్రజా సీమ)**

మండలంలోని బాకరాపేట సమీపాన ఏపీఎస్పీ 11 వ పోలీస్ పటాలయంలో శుక్రవారం పొన్న మాండ లక్ష్మణస్వామి వర్మ జయంతి వేడుకలు సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా కమాండెంట్ ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ సమాజ సేవ, సామాజిక న్యాయం వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం విశేష కృషి చేసిన మహానీయుడని ఆయన ఆదర్శాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సేవలో నిబద్ధతతో విధులు నిర్వహించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, ఆర్ఎస్ఐలు, ఏ ఆర్ ఎస్ ఐ లు, మరియు సిబ్బంది పాల్గొన్నారు



# ఘనంగా విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి కార్యక్రమం

### - బిటి కళాశాల ప్రిన్సిపాల్,అధ్యాపకులు నివాళి

**మదనపల్లె (ప్రజా సీమ)**

: పట్టణంలోని చారిత్రాత్మక బెసెంట్ దివ్యజ్ఞాన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు శుక్రవారం విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని పురస్కరించుకొని కళాశాల ప్రాంగణంలోని ఠాగూర్ కాటేజీకి వెళ్లి అక్కడ ఉన్న రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవీంద్రనాథ్ ఠాగూర్ 1919లో మదనపల్లిలోని మన బీటీ కాలేజీని సందర్శించారని,అప్పుడు వారు బెంగాలీలో ఉన్న మన జాతీయగీతం జనగణమనని ఆంగ్లంలోకి ఇక్కడే అనువదించారని,అదే సమయంలోనే అప్పటి కళాశాల ప్రిన్సిపల్ జేమ్స్ కజిన్స్ సతీమణి మార్గరెట్ కజిన్స్ మన జాతీయ గీతానికి స్వరం కట్టి మొదటిసారి బీటీ కాలేజీ విద్యార్థుల చేత పాడించారని గుర్తుచేశారు. ఠాగూర్ కి నివాళులర్పించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ గుత్తా గిరిబాబుతోపాటు కళాశాల అధ్యాపకులు డాక్టర్ జి. చిన్నారెడ్డి,బాలాజీ,డాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు.



# భారతీయ సంస్కృతిలో చేనేత వస్త్రాలు విశిష్ట మైనవి.

**రాజంపేట (ప్రజా సీమ):**

భారతీయ సంస్కృతిలో చేనేత వస్త్రాలు విశిష్ట మైనవనీ ప్రధానోపాధ్యాయు రాలు కె.భారతి అన్నారు. రాజంపేట మండలం కొత్త బోయిన పల్లి పి.యం.శ్రీ.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవం నేషనల్ హ్యాండ్లూమ్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో భాగమైన చేనేత రంగాన్ని గౌరవించడం మరియు నేత కార్మికులను ఆదుకోవడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం అన్నారు. 1905 ఆగస్టు 7న కలకత్తా టౌన్ హాల్‌లో 'స్వదేశీ ఉద్యమం' అధికారికంగా ప్రారంభమైందనీ, విదేశీ వస్తువులను బహిష్కరించి, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడమే ఈ ఉద్యమ లక్ష్యమని,ఈ చారిత్రాత్మక రోజుకు గుర్తుగా ఆగస్టు 7ను చేనేత దినోత్సవంగా ఎంచు కున్నారన్నారు. ఉపాధ్యాయులు జనార్ధన్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ 2015 ఆగస్టు 7న చెన్నైలో మొదటి జాతీయ చేనేత దినోత్సవాన్ని అధికారికంగా ప్రారంభించా రన్నారు. పాఠశాల చైర్మన్ గోపాల రావు మాట్లాడుతూ చేనేత రంగంపై ప్రజల్లో అవగాహన పెంచడం, దేశ ఆర్థికాభివృద్ధిలో నేత కార్మికుల సహకారాన్ని గుర్తించడం మరియు వారి ఆదాయాన్ని మెరుగుపరచడం ముఖ్యమని అన్నారు. ఉపాధ్యాయులు రాజయ్య మాట్లాడుతూ మన దేశంలో మహిళా సాధికారతకు ఈ రంగం ఎంతో దోహదపడుతోందనీ, ఎందుకంటే నేత కార్మికులలో 70% కంటే ఎక్కువ మంది మహిళలే ఉన్నారన్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు గోపాలరావు, బాలాజీ, వెంకటసుబ్బయ్య లను శాలువాతో సత్కరించారు. విద్యార్థిని విద్యార్థులకు చిత్ర లేఖన పోటీలు నిర్వ హించగా సీనియర్స్ లో 9 వ తరగతి చెందిన కీర్తి రాజేశ్వరి ప్రథమ స్థానం,తనూజ ద్వితీయ స్థానం,జూనియర్స్ లో ఏడవ తరగతికి చెందిన దీపకేశ్వర్ ప్రథమ స్థానం,అన్నమయ్య ద్వితీయ స్థానం సాధించారు. సభలో చేనేత కార్మికులకు సంబంధించిన వస్తు ప్రదర్శన నిర్వహించారు. బాల బాలికలు చేనేత వస్త్రాలు ధరించి క్యాట్ వాక్ చేసి, అలరించారు. ఇంకా ఈ సమావేశం లో శేషగిరి, పారా శ్రీరాము లు, శివ ప్రసాద్ గౌడ్, ఎస్.ప్రభాకర్రావు, విజయ భాస్కర్,అనిల్, మజ్జారి చెన్న కేశవులు, సువర్ణ సుందరి, అమరావతి, మధు వాణి,ప్రణవి, దార్ల శ్రీనివాసులు ఆచారి, మేడా సాయినాథ్, ప్రశాంత్,సి.ఆర్.పి. బాలాజీ తదితరులు పాల్గొన్నారు.





# ప్రజా సమస్యల పరిష్కారమే తెలుగుదేశం లక్ష్యం

రాజంపేట (ప్రజా సీమ):

రాజంపేట మున్సిపాలిటీలోని ఆర్ఎస్ రోడ్ నందు శుక్రవారం డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు టిడిపి పార్టీ రెండేళ్లు పాలనలో అందించిన పథకాలు గురించి వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కేజీపీ నాయకులు డాక్టర్ నవీన్ కుమార్, మాజీ టౌన్ ప్రెసిడెంట్ సంజీవరావు, మాజీ మండలాధ్యక్షుడు వెంకటేశ్వర్లు నాయుడు, అంజిబాబు ఆచారి, మన్నూరు పేరు చంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.






# ఈ నెల 12న శ్రీ మారుతీ ట్రస్ట్, శ్రీ మారుతీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

రాజంపేట (ప్రజా సీమ):

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పి 4 విజన్లో భాగంగా ఈ నెల 12వ తేదీ (బుధవారం) రాజంపేట ఆర్ అండ్ బి భవనం నందు శ్రీ మారుతీ ట్రస్ట్ మరియు శ్రీ మారుతీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీ మారుతీ హాస్పిటల్ చైర్మన్ రామకృష్ణ నాయుడు తెలిపారు. ఈ మెగా వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా డి ఐ జీ కోయ ప్రవీణ్ పాల్గొంటారని వారు తెలిపారు. ఈ మెగా వైద్య శిబిరం ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిబిరంలో శ్రీ మారుతీ హాస్పిటల్‌కు చెందిన సూపర్ స్పెషాలిటీ వైద్యులు ప్రజలకు వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. అంతేకాకుండా రూ.4,000కు పైగా విలువైన వైద్య పరీక్షలు, ఉచిత మందులు, అవసరమైన వారికి వైద్య సలహాలు, ఉచిత భోజన సౌకర్యం, రవాణా సౌకర్యం పూర్తిగా ఉచితంగా కల్పించబడుతాయని వివరించారు. రాజంపేట పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాలని ఆయన కోరారు.






# రైలు ఢీకొని వ్యక్తి మృతి

## అప్పయ్యరాజుపేట రైల్వే అండర్‌పాస్ వద్ద ప్రమాదం

పుల్లంపేట, ప్రజాసీమ న్యూస్:



తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం అప్పయ్యరాజుపేట రైల్వే అండర్‌పాస్ సమీపంలో పూణే-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం అప్పయ్యరాజుపేట పెరియవరం అరుంధతివాడకు చెందిన తన కుమార్తెను చూడడానికి వచ్చిన చిన్న సుబ్బయ్య అనంతరం తన స్వగ్రామమైన కడప జిల్లా కొప్పోలు గ్రామానికి తిరిగి వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. రైల్వే పట్టాలు దాటే క్రమంలో రైలు ఢీకొట్టిందా? లేక ప్రమాదవశాత్తు పట్టాలపైకి వెళ్లారా? అనే కోణంలో రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పూణే--కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో చిన్న సుబ్బయ్య అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనకు గల పూర్తి కారణాలనుతెలుసుకునేందుకు రైల్వే పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. రైలు పట్టాలు దాటే సమయంలో ప్రమాదం జరిగిందా లేదా మరేదైనా కారణం ఉందా అనే విషయాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# చిన్న గంగయ్య మృతికి బత్యాల సంతాపం

పుల్లంపేట, ప్రజాసీమ న్యూస్:



రైల్వేకోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలం ఎగువరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొండేటి చిన్న గంగయ్య ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ బత్యాల చంగల్‌రాయుడు శుక్రవారం ఎగువరెడ్డిపల్లి గ్రామానికి చేరుకుని చిన్న గంగయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతినితెలియజేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండేటి రమణ. కూటమి పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు నివాళులర్పించారు.

# మదనపల్లె చేనేతకు బ్రాండ్ ఇమేజ్ తీసుకురాడమే లక్ష్యం





- నేతన్న సేవలో పథకంతో చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా
- జిల్లాలో 3,869 మంది లబ్ధిదారులకు రూ.9.67 కోట్ల ఆర్థికసాయం
- ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా వెల్లడి

మదనపల్లె (ప్రజా సీమ) :

12వ జాతీయ చేనేత దినోత్స వాన్ని పురస్క రించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నేతన్న సేవలో పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం చీరాలలో ప్రారంభించి,అర్హులైన చేనేత కార్మికుల బ్యాంకు ఖాతాల్లో రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని జమ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చేనేత,జౌళి శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా,డిఆర్ఓ వెంకటేశు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. మదనపల్లె శాసనసభ్యులు షాజహాన్ బాషా మాట్లాడుతూ మదనపల్లె చేనేతకు ప్రత్యేక బ్రాండ్ గుర్తింపు తీసుకురావడం తమ హక్కు అని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి,మదనపల్లె చేనేతకు ప్రత్యేక బ్రాండ్ గుర్తింపు ప్రకటించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చేనేత రంగ ప్రతినిధులు,నాయకులతో కలిసి ముఖ్యమంత్రిని కలిసి ఈ అంశంపై ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తామని తెలిపారు. అదేవిధంగా తిరుమల తిరుపతి దేవస్థానానికి సమర్పించే పట్టు వస్త్రాలను మదనపల్లె చేనేత కార్మికుల నుంచే కొనుగోలు చేసేలా ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తామని చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 50 సంవత్సరాలు దాటిన అర్హులైన చేనేత కార్మికులకు నెలకు రూ.4,000 పింఛన్,చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు,పవర్‌లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తూ చేనేత రంగ సంక్షేమానికి తోడ్పడుతోందని తెలిపారు. అలాగే సహకార సంఘాలకు ఆర్థిక చేయూత,హ్యాండ్లూమ్ పార్కులు,చేనేత మ్యూజియంల ఏర్పాటు వంటి కార్యక్రమాల ద్వారా చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకొని తమ జీవనోపాధిని మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. జిల్లాలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పథకం ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చేనేత కార్మికుల గృహ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే తెలిపారు. పోతబోలు ప్రాంతంలో సుమారు 1,250 ఇళ్లను అందించే కార్యక్రమం కొనసాగుతోందని, అదనంగా అందుబాటులో ఉన్న భూమిని ఉపయోగించి చేనేత కార్మికులకు ప్రత్యేక కాలనీ ఏర్పాటు కృషి చేస్తామని తెలిపారు. కోళ్లబైలు సచివాలయం సమీపంలోని అసంపూర్తిగా ఉన్న చేనేత భవన్‌ను పూర్తి చేసేందుకు రూ.15 లక్షలు సమకూర్చేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. పంచాయతీ ద్వారా లేదా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అవసరమైన నిధులు మంజూరు చేయించి భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ కాలనీలు,ప్రాంతాల్లో మగ్గాలు ఏర్పాటు చేసుకుని చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలపై సచివాలయాల ద్వారా సమగ్ర సర్వే నిర్వహించాలని అర్హులైన కుటుంబాలను గుర్తించి వారికి గృహ సదుపాయం,అవసరమైన చేనేత పరికరాలు,టూల్ కిట్లు అందించేలా ప్రణాళిక రూపొంది స్తామని తెలిపారు. ప్రస్తుతం అమలు చేస్తున్న రూ.25 వేల సహాయ కార్యక్రమంలో అర్హులైన పేద చేనేత కుటుంబాలు ఒక్కటి కూడా మిగిలిపోకుండా అధికారులు చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. మదనపల్లెలో మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయడం చేనేత రంగ అభివృద్ధికి ఎంతో అవసరమని గతంలో క్లస్టర్ కోసం ప్రతిపాదనలు చేసినప్పటికీ కొన్ని కారణాలతో ప్రక్రియ ముందుకు సాగలేదన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ చేనేత రంగం భారత స్వాతంత్ర్య ఉద్యమంతోముడిపడి ఉన్న గొప్ప వారసత్వమని,చేనేత కార్మికుల కళా నైపుణ్యం, కృషి,ప్రతిభ దేశవ్యాప్తంగా ఎంతో గౌరవాన్ని పొందుతున్నాయని తెలిపారు. మహాత్మా గాంధీ పిలుపునిచ్చిన స్వదేశీ వస్త్రాలను ధరించండి,విదేశీ వస్త్రాలను బహిష్కరించండి అనే నినాదంతో స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత రంగం కీలక పాత్ర పోషించిందన్నారు. దేశం ఉన్నంతకాలం చేనేత కార్మికుల కళా నైపుణ్యం,గొప్పతనం కొనియాడబడుతూనే ఉంటుందని పేర్కొన్నారు. చేనేత మరియు జౌళి శాఖ అధికారి పవన్ కుమార్ అన్నమయ్య జిల్లాలో ప్రభుత్వం ద్వారా అమలు చేయుచున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలపై నివేదికను వివరించారు. చేనేత రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లాలో 2026 - 27 ఆర్థిక సంవత్సరానికి చేనేత,జౌళి శాఖ,డిఆర్డిఏ ఆధ్వర్యంలో బ్యాంకు లింకేజీ ద్వారా 51 మంది చేనేత మహిళ సంఘ సభ్యులకు రూ.83,50,001/- మెగా చెక్కును ముఖ్య అతిథుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం నేతన్నలకు ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివరామ్,చేనేత శాఖ అధికారి పవన్ కుమార్,చేనేత సంఘ నాయకులు బొమ్మిశెట్టి పురుషోత్తం ,రామిశెట్టి కృష్ణ (కమలామ్రి),రామిశెట్టి నీలకంఠ ,మోడెం సిద్ధప్ప,హరికృష్ణ,యర్రబల్లి వెంకటరమణా రెడ్డి,ఓర్సు వీరభాస్కర్,డి.రమేష్ రెడ్డి,రామిశెట్టి రెడ్డి కేశవ,ప్రభాకర్, బాలమాలి శేఖర్,రామ్మోహన్,నరసింహ ,వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు,చేనేత మరియు జౌళి శాఖ అధికారులు,జిల్లా అధికారులు,చేనేత కార్మికులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# చేనేతకు పవన్ అండదండలు





- చేనేత కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి
- జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్రబాబు

కాకినాడ జిల్లా (ప్రజా సీమ )

గొల్లప్రోలు, చేనేత రంగానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే కొణిదెల పవన్‌కల్యాణ్ అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్రబాబు అన్నారు. చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంచడం ద్వారా సంప్రదాయ చేనేత పరిశ్రమను పరిరక్షించడంతో పాటు, కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చవచ్చని పేర్కొన్నారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో కాకినాడ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ వేడుకలకు నాగేంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నాగేంద్రబాబు మాట్లాడుతూ.. చేనేత రంగం దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజల సహకారం అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను వినియోగించడం ద్వారా కార్మికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. డీసీసీబీ చైర్మన్, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు తుమ్మల రామస్వామిబాబు మాట్లాడుతూ.. చేనేత అనేది మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. చేనేత కార్మికుల శ్రమను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగ అభివృద్ధికి చేపడుతున్న చర్యలు కార్మికులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఫైవ్‌మెన్ కమిటీ సభ్యుడు ఓదూరు కిషోర్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, బుర్ర దివ్యరాజ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, చేనేత కార్మికులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చేనేత రంగం మరింత అభివృద్ధి చెందాలని, చేనేత కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షిస్తూ కార్యక్రమంలో జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# సేవా కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేస్తున్న ఏబీసీ సేవా సంస్థ

- సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి

మదనపల్లె (ప్రజా సీమ) :



అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లె పట్టణంలో సేవా కార్యక్రమాలకు ఏబీసీ సేవా సంస్థ చిరునామాగా నిలుస్తోంది. సమాజ హితాన్ని అకాంక్షిస్తూ సేవా కార్యక్రమాలకు కేంద్ర బిందువుగా వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి నిలచారు. తన కష్టార్జితంతో సొంత నిధులను వెచ్చించి అవసరమైన వారికి తానున్నానంటూ అభయహస్తం అందిస్తూ,సమాజ సేవలో తనదైన ముద్ర వేస్తున్నారు. తన సొంత నిధులతో పేదలు,బడుగు,బలహీన వర్గాల ప్రజలకు,గ్రామీణ పట్టణ ప్రాంతాల విద్యార్థులకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ,ఏ కష్ట సమయంలోనైనా అండగా నిలుస్తూ ఆపన్నహస్తంగా మారారు. ముఖ్యంగా కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న పేదలను గుర్తించి,వారికి మదనపల్లె లయన్స్ కంటి ఆసుపత్రిలో ఉచిత కంటి శస్త్రచికిత్సలు నిర్వహించేలా ఆర్థిక సహాయం అందిస్తూ,వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నారు. ఎలాంటి రాజకీయ అండదండలు లేకపోయినా సేవా దృక్పథంతో ముందుకు సాగుతూ,ఏబీసీ సేవా సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వ హిస్తున్నారు. అనాథ పిల్లలకు అన్న దానం,అవసరమైన వారికి ఆర్థిక సహాయం,విద్యార్థులకు ప్రోత్సహిస్తూ బహు మతులు అందించటం,విద్యా సామాగ్రి వితరణ,పర్యావరణ,పచ్చదనం పెంచడానికి సీడ్ బాల్స్ ను విరివిగా చల్లడం వంటి ఎన్నో కార్యక్రమాలను స్వయంగా ముందుండి నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. నిస్వార్థ సేవా భావంతో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తున్న డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారికి హృదయపూర్వక అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవాకార్యక్రమాలు చేపట్టాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

ప్రజాసీమ

# మద్యం, మాదక ద్రవ్యాల వ్యతిరేక ఉద్యమ సారథి దూబగుంట రోశమ్మకు ఘన నివాళి





పిఠాపురం (ప్రజా సీమ ) :

మద్యం, మాదక ద్రవ్యాల వ్యతిరేక ఉద్యమ సారథి, మహిళా చైతన్య ప్రతీక దూబగుంట రోశమ్మ 10వ వర్ధంతి వేడుకలు పిఠాపురం మండలం గోకివాడ గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, మహిళలు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మద్యం, మాదక ద్రవ్యాల వ్యతిరేక పోరాట జిల్లా నాయకులు వేమగిరి తలుపులియ్య మాట్లాడుతూ, నెల్లూరు జిల్లా దూబగుంట గ్రామానికి చెందిన వర్ధినేని రోశమ్మ తన జీవితంలో ఎదురైన చేదు అనుభవాలను సమాజ మార్పుకు పునాదిగా మలిచారని కొనియాడారు. మద్యానికి బానిసైన కుటుంబ సభ్యుల వల్ల తాను పడిన కష్టాలు మరే మహిళకు రాకూడదనే దృఢ సంకల్పంతో, పది మంది మహిళలతో కలిసి ఆమె ప్రారంభించిన సారా వ్యతిరేక ఉద్యమం చారిత్రాత్మకమైనదని గుర్తుచేశారు. దూబగుంటలో మొదలైన పోరాటం నెల్లూరు జిల్లా దాటి రాష్ట్రవ్యాప్తంగా సంపూర్ణ మద్యపాన వ్యతిరేక ఉద్యమంగా మారిందని పేర్కొన్నారు. రోశమ్మ ఉద్యమ తీవ్రతకు అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు కదలివచ్చి, రాష్ట్రంలో మద్యపాన నిషేధంపై చారిత్రాత్మక చర్యలు చేపట్టారని గుర్తుచేశారు. దాదాపు 30 ఏళ్ల పాటు మద్యం, మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం రోశమ్మ అలుపెరగని పోరాటం చేశారని తలుపులియ్య కొనియాడారు. సమాజంలో మద్యాన్ని పూర్తిగా నిర్మూలించడమే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మద్యాన్ని కేవలం ఆదాయ వనరుగా మాత్రమే చూడకూడదని, ప్రజల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమమే పరమావధిగా పాలసీలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. "ప్రజలను పరిపాలించండి గానీ, ప్రజల చేత తాగించొద్దు" అంటూ ఈ సందర్భంగా వారు ప్రభుత్వాలకు హితవు పలికారు. ఈ నివాళి కార్యక్రమంలో మద్యం వ్యతిరేక పోరాట నాయకులు లోడ సూరిబాబు, ఎంఆర్పీఎస్ నాయకులు వేమగిరి సూరి సత్యనారాయణ, వేమగిరి చిన్నారి, గౌరీ, లోడ పాప, చెల్లూరి ప్రేమలత, వేమగిరి మరియమ్మ, భవాని, మరియా, మిరియాల చిలకమ్మతో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# మిట్స్ యూనివర్శిటీలో జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం





## - చేతిమగ్గం,యంత్ర మగ్గం యూనిట్లను పరిశీలించిన విద్యార్థులు

మదనపల్లె (ప్రజా సీమ) :

మదనపల్లె సమీపంలోని (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో శుక్రవారం ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మిట్స్ ఇండస్ట్రీ రిలేషన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.ఎం.బాలాజీ మాట్లాడుతూ భారతదేశ సుసంపన్నమైన చేనేత వారసత్వాన్ని పరిరక్షించడంతోపాటు చేనేత కార్మికులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని వివరించారు. చేనేత భారతదేశ సంస్కృతి ,సంప్రదా యాలకు ప్రతీకగా నిలుస్తుందని, ఈ గొప్ప వారసత్వాన్ని భవిష్యత్తు తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కృత్రిమ మేధస్సు (ఎఐ) వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చేనేత కార్మికుల అభివృద్ధికి అనుసం ధానం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉత్పత్తి, మార్కెటింగ్, విక్రయాలు, చేనేత కళాకారుల జీవనోపాధిని మెరుగుపరిచే విధంగా విద్యార్థులు వినూత్న సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయాలని సూచించారు. ఇందులో భాగంగా డాక్టర్ బి.అనిత మాట్లాడుతూ భారతీయ చేనేత రంగం యొక్క ఘనమైన వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు చేనేత కార్మికులను ప్రోత్సహించి, వారికి అండగా నిలవాలని అన్నారు. ముఖ్యంగా యువ సాంకేతిక నిపుణులు డిజైన్ ,ఉత్పత్తి, డిజిటల్ మార్కెటింగ్, మార్కెట్ అవకాశాల విస్తరణ వంటి రంగాల్లో వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడం ద్వారా చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు. అదేవిధంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సందేశాన్ని వీడియో రూపంలో ప్రదర్శించారు .ఇందులో భాగంగా మిట్స్ విద్యార్థులు చేతిమగ్గం (హ్యాండ్‌లూమ్) మరియు యంత్ర మగ్గం (పవర్ లూమ్) యూనిట్లను సందర్శించి, చేనేత మరియు పవర్‌లూమ్‌లలో వస్త్రాల తయారీ విధానం, ఉపయోగించే సాంకేతికత, నూలు తయారీ నుంచి వస్త్ర ఉత్పత్తి వరకు జరిగే వివిధ ప్రక్రియలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.ఎం బాలాజీ, ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ విభాగాధిపతి డాక్టర్ మనవాళన్ గుణశేఖరన్, డాక్టర్ బి.అనిత, అధ్యాపకులు మరియు ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా ఆడికృతిక సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం





పుల్లంపేట, ప్రజాసీమ న్యూస్:

తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం పుల్లంపేట గ్రామంలో వెలసిన శ్రీ పర్వతవర్ధిని దేవి సమేత శ్రీ శాంతిలింగేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం ఆడికృతిక సందర్భంగా శ్రీ వల్లి దేవి, దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికిపంచామృతాభిషేకం, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలను వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. పురోహితులు చపాటి నాగరాజు, సత్యనారాయణ స్వామి, యశ్వంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు జరిగాయి. ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం శ్రీ వల్లి దేవి, దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారి కల్యాణాన్ని వేద పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు .కల్యాణోత్సవం అనంతరం భక్తుల కోసం నిర్వాహకులు భారీ ఎత్తున అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలోనిర్వాహకులు నూకల సుబ్రహ్మణ్యం, మాడ కుమారస్వామి, సోము బాలాజీ, నాగభూషణం బాబు, బండారు సురేష్ బాబు, చింతగింజల ద్వారకా గోపినాథ్, దిగదారి చంగల్‌రాయుడు, మురళీకుమార్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు

# రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించండి

**నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలి: తిరుపతి శాస్త్రవేత్తలు**




పుల్లంపేట, ప్రజాసీమ న్యూస్:

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి జీవ ఎరువులు, పీఎండీఎస్ కిట్లను వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తిరుపతి శాస్త్రవేత్తల బృందం రైతులకు సూచించింది. పుల్లంపేట మండలం చెన్నయ్యగారిపల్లి గ్రామ పరిధిలో శుక్రవారం వివిధ పంటలు, మామిడి తోటల్లోని పీఎండీఎస్ పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎల్‌నీనో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల వంటి ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. పీఎండీఎస్ కిట్లు, జీవ ఎరువులను వినియోగిస్తూ రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని కోరారు. నీటి వసతి పరిమితంగా ఉన్న ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి ఆరుతడి పద్ధతులను పాటిస్తూ, పంట పరిస్థితిని బట్టి పొటాషియం నైట్రేట్ లేదా 19-19-19 ఎరువులను లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలని శాస్త్రవేత్తలు సూచించారు. రైల్వేకోడూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ ఎస్. మణి మాట్లాడుతూ, ఎల్‌నీనో ప్రభావంతో రైతులు ఎదుర్కొనే సమస్యలను సీజన్ ముగిసే వరకు గ్రామస్థాయిలో వ్యవసాయ సిబ్బంది నిరంతరం పరిశీలించి, అవసరమైన సూచనలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం తిరుపతి ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ మురళీకృష్ణ, ఎస్వీ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఏ.వి. నాగవేణి, డాక్టర్ లావణ్య, డాక్టర్ శ్రీకళ, పుల్లంపేట మండల వ్యవసాయ అధికారి ఎస్. ప్రవీణ్, ఉద్యానవన సహాయకులు మహేష్, రెడ్డి ప్రవీణ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బుజ్జమ్మ, నరసింహులు, పీఆర్పీలు, ఐసీఆర్పీలు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

# పూరీలో పిఠాపురం ప్రముఖులకు 'జ్ఞాన ప్రకాష్ నేషనల్ అవార్డు'లు

పిఠాపురం,(ప్రజా సీమ )

:ఒడిశాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పూరీ సాంస్కృతిక విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 'జ్ఞాన ప్రకాష్ నేషనల్ అవార్డ్స్' ప్రధానోత్సవంలో పిఠాపురం నియోజకవర్గానికి చెందిన ఎనిమిది మంది ప్రముఖులు జాతీయ అవార్డులను అందుకున్నారు. జ్ఞాన ప్రకాష్ పత్రిక 10వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 2వ తేదీన పూరీలో ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం ఘనంగా జరిగింది. దేశవ్యాప్తంగా సుమారు 20 రాష్ట్రాల నుండి విద్యా, విజ్ఞానం, ఆధ్యాత్మికత, సామాజిక సేవా రంగాలలో విశేష కృషి చేసిన 300 మందిని ఎంపిక చేసి ఈ అవార్డులను అందజేశారు. ఇందులో భాగంగానే పిఠాపురం ప్రాంతం నుండి వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న ఎనిమిది మందిని ఈ జాతీయ పురస్కారాలకు ఎంపిక చేయడం విశేషం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి సీసీఆర్‌టీ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న కేవీఎస్ఎస్ ప్రసాద్ నేతృత్వంలో పిఠాపురం నుండి ఈ ఎనిమిది మంది ఎంపికయ్యారు. శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం, 'మన ఊరు మన బాధ్యత' స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా తాము అందిస్తున్న సామాజిక, సాంస్కృతిక సేవలను గుర్తించి ఈ జాతీయ అవార్డును అందించడంపై అవార్డు గ్రహీతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జ్ఞాన ప్రకాష్ పత్రిక వ్యవస్థాపకులకు, కార్యవర్గానికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ ఎంపికకు సహకరించిన కేవీఎస్ఎస్ ప్రసాద్‌ను అవార్డు గ్రహీతలు శాలువాతో ఘనంగా సత్కరించారు. అవార్డులు అందుకున్న పిఠాపురం ప్రముఖులు:కొండేపూడి శంకరరావు (కార్యదర్శి, శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం)అల్లవరపు నగేష్ (కార్యదర్శి, మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంద సేవా సంస్థ)పెమ్మరాజు సత్య రామచంద్రరావు (ఆర్ఎస్ఎస్) కాకినాడ జిల్లా ఇంచార్జి)తటవర్తి సుబ్బారావు (తెలుగు ఉపాధ్యాయులు)పైండా శ్రీనివాస్ (ఇంగ్లీష్ ఉపాధ్యాయులు)కాగిత నాగేశ్వరరావు (దారు శిల్పి)చింతపల్లి సింహాద్రి (ఉపాధ్యాయులు)మేకా సూర్య ప్రకాష్ (సభ్యులు, గుడ్ ఫ్రెండ్స్ చారిటీ)జాతీయ స్థాయిలో పిఠాపురం కీర్తిని చాటిన అవార్డు గ్రహీతలను పలువురు ప్రముఖులు, స్థానికులు




# గ్రీన్ పిఠాపురం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## - ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు, ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్

పిఠాపురం (ప్రజా సీమ )"

మన పిఠాపురం -- మన గ్రీన్ భవిష్యత్తు" అనే నినాదంతో పిఠాపురం నియోజకవర్గాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని శాసనమండలి సభ్యులు శ్రీ కొణిదెల నాగబాబు , కాకినాడ పార్లమెంట్ సభ్యులు శ్రీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు, పిఠాపురం శాసనసభ్యులు శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ ఆలోచనలు, ఆదేశాల మేరకు గ్రీన్ పిఠాపురం కార్యక్రమానికి పిఠాపురం పట్టణంలోని టిట్కో గృహాల వద్ద ఘనంగా అంకురార్పణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్సీ శ్రీ కొణిదెల నాగబాబు , ఎంపీ శ్రీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ , డీసీసీబీ చైర్మన్ శ్రీ తుమ్మల రామస్వామి బాబు మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. పిఠాపురం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన పచ్చని ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం "పచ్చని పిఠాపురం" లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.
ఈ కార్యక్రమంలో ఫైవ్ మాన్ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే శ్రీ పెండెం దొరబాబు , శ్రీ ఓదూరి కిషోర్ , పిఠాపురం పాడా పీడీ శివరాం ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ వాకాపల్లి దేవి సూర్యప్రకాశ్, పిఠాపురం పట్టణ అధ్యక్షురాలు డా. చిక్కాల వరలక్ష్మి, బొజ్జ లోవరాజు, బొజ్జ కుమార్, దేవరపల్లి చినబాబు, ఆగంటి ప్రభాకర్, గరగా బాబీ, శ్రీ కొత్తపల్లి బుజ్జి, వైస్ ఇన్‌చార్జ్ శ్రీ బలిపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.





ప్రజాసీమ

# రోడ్డుప్రమాదంలో గాయపడిన విలేకరి పోలీసుల పరామర్శ

## - న్యాయం చేస్తామని సీఐ రవి నాయక్ హామీ

**మదనపల్లె (ప్రజా సీమ) :**

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స అనంతరం స్వగృహానికి చేరుకున్న మదనపల్లెకు చెందిన హ్యాన్స్ ఇండియా జాతీయ దినపత్రిక విలేకరి యుగంధర్‌ను మదనపల్లె రూరల్ సీఐ రవినాయక్,ఎస్ఐ మధు రామచంద్రుడు శుక్రవారం ఆయన నివాసంలో పరామర్శించారు.ప్రమాదంలో కాలికి తీవ్ర గాయాలు కావడంతో బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు చేయించుకున్న యుగంధర్ ఇటీవల ఇంటికి చేరుకున్నారు.ఈ సందర్భంగా బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న సీఐ రవి నాయక్ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నారు.ప్రమాదానికి కారణమైన వాహన యజమానితో మాట్లాడి బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అలాగే ఇన్సూరెన్స్ ద్వారా అందాల్సిన నష్టపరిహారం పొందేందుకు పోలీసు శాఖ నుంచి అవసరమైన అన్ని పత్రాలను త్వరితగతిన అందజేస్తామని వెల్లడించారు.బాధిత కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి సహకారం అందిస్తామని,చట్టపరంగా అవసరమైన అన్ని చర్యలు చేపడతామని సీఐ రవి నాయక్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా అక్కడున్న విలేకరులు,స్నేహితులు పోలీసు అధికారుల స్పందనకు కృతజ్ఞతలు తెలిపారు.



# బడుగుల ఆశాజ్యోతి పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ

## - ఘన నివాళులర్పించిన జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఇందులో భాగంగా ఆయన చిత్రపటానికి ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బలహీన వర్గాల హక్కుల సాధన కోసం పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ చేసిన కృషి ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని,ఆయన చేసిన నిస్వార్థ సేవలను స్ఫూర్తిగా తీసుకుని ఆయా వర్గాల రక్షణ కోసం పోలీసు యంత్రాంగం అంతా అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) యం.వెంకటాద్రి,ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి,సీఐలు ఆదినారాయణ రెడ్డి,ఎరీషావలి,ఆర్ఎస్ఐ శ్రీనివాస్,కార్యాలయ సిబ్బంది,పోలీసు సిబ్బంది మరియు మహిళా పోలీసులు పాల్గొన్నారు.





# ఆడి కృత్తిక సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించిన తల్లెం భరత్ కుమార్ రెడ్డి

**రైల్వే కోడూరు (ప్రజాసీమ )**

ఆడి కృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని ఓబులవారిపల్లె , రైల్వే కోడూరు మండలంలోని స్థానిక శివాలయ ప్రాంగణంలో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారి ఆలయంలో భక్తిశ్రద్ధలతో డి ఆర్ యు సి సి సభ్యులు వైసిపి రాయలసీమ జోన్వూర్ కమిటీ సభ్యులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.?ఈ సందర్భంగా స్వామివారికి తెల్లవారుజాము నుంచే సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, పాల అభిషేకాలు మరియు రంగురంగుల పుష్పాలతో విశేష అలంకరణలు చేపట్టారు. స్వామివారిని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు. ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు ఈ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించారు.



# రెవెన్యూ భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం







## టిడిపి ఇంచార్జి చమర్తి జగన్మోహన్ రాజు

**సిద్ధవటం( ప్రజా సీమ)**

రెవెన్యూ సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి చమర్తి జగన్మోహన్ రాజు తెలిపారు. సిద్ధవటం మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ బంగారుపేట గ్రామంలోని కనకదుర్గ కళ్యాణ మండపంలో శుక్రవారం రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాల ప్రజలకు సంబందించి రెవిన్యూశాఖ భూ సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా టీడీపీ ఇంచార్జి జగన్మోహన్ రాజు మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రెవెన్యూ భూమి అడ్డగోలుగా కబ్జా చేసి నిరుపేదలకు అన్యాయం చేశారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతులకు రెవెన్యూశాఖ భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎస్.కే.ఆర్.నగర్ దళిత రైతులకు వైసీపీ ప్రభుత్వంలో అన్యాయం చేశారని ప్రస్తుతం అర్హులైన ప్రతి ఒక్కరికి భూములు దక్కేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మాధవరం 1,2,3, వార్డు గ్రామం, శాఖరాజు పల్లి రెవిన్యూ పొలంలో కొంతమంది రెవెన్యూ రికార్డులు పేర్లు నమోదు చేసుకొని తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పొందినట్లు ఫిర్యాదులు వచ్చాయని వీటన్నిటిపై సంబందిత రెవిన్యూ శాఖ అధికారులతో సమగ్రంగా విచారణ చేసి పేదలకు న్యాయం చేస్తామన్నారు. రాజంపేట జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ మాట్లాడుతూ అర్హులైన పేదల భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి రైతుకు న్యాయం చేసేందుకు రెవిన్యూ భూ సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేశారన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో ప్రభుత్వ భూములు కొల్లగొట్టి నిరుపేదలకు అన్యాయం చేశారన్నారు. ఎస్సీ దళిత భూములు రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప, బద్వేల్ ఆర్డీవోలు మురళి, చంద్రమోహన్, జనసేన పార్లమెంట్ ఇంచార్జి శ్రీనివాసరాజు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, నాగోతు రమేష్ నాయుడు, రెవిన్యూ అధికారులు, మండలస్థాయి అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

# సిద్ధవటంలో స్మార్ట్ కిచెన్ ను పరిశీలించిన కూటమి నాయకులు

## రమేష్ నాయుడు, అతికారి కృష్ణ

**సిద్ధవటం (ప్రజా సీమ )**

కడప జిల్లాలోని సిద్ధవటం మండలంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ కిచెన్ ను పరిశీలించిన బి.జె.పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ నాగోతు రమేష్ నాయుడు శుక్రవారం జిల్లాలోని సిద్ధవటం మండల హెడ్ క్వార్టర్స్ లో విద్యార్థిని విద్యార్థినులకు డొక్కా సీతమ్మ భోజన పథకం కు ఏర్పాటుచేసిన స్మార్ట్ కిచెన్ ను జనసేన రాజంపేట పార్లమెంటరీ సమన్వయకర్త శ్రీ అతికారి కృష్ణ గారితో కలిసి పరిశీలించడం జరిగింది. ఇక్కడ భోజన తయారీకి ఏర్పాటుచేసిన స్టీమ్ బాయిల్ పరికరాలను మరియు నూతన టెక్నాలజీతో ఏర్పాటుచేసిన వంటశాల సామాగ్రిని, సోలార్ ఎనర్జీ ని ఉపయోగించి నీటిని బాయిల్ చేసి వంటలు వండే టెక్నాలజీని క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. తదనంతరం అతికారి కృష్ణ గారితో కలిసి సమావేశంలో పాల్గొన్న రమేష్ నాయుడు, మాట్లాడుతూ" స్మార్ట్ కిచెన్ ఐడియా రోల్ మోడల్ ఫర్ నేషన్"అని ఇది విద్యార్థులకు ఒకే రకమైన భోజన వసతి కల్పిస్తుందని, జిల్లా నలుమూలల ఉన్న అన్ని స్కూళ్లకు మరియు పాఠశాలలకు రోజుకి సుమారు లక్ష మంది విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన ఉడికించిన పోర్టు ఫైడ్ బియ్యంతో, నిర్దిష్టమైన మెనూతో మంచి ఆహారం పరిశుభ్రంగా అందించడం జరుగుతుందని తెలియజేశారు. పోషక విలువలతో కూడిన ఆహారం తినడం వలన విద్యార్థులు మానసికంగా మరియు శారీరకంగా ఎంతో అభివృద్ధి చెంది ఆరోగ్యప్రదమైన విద్యను అభ్యసించుటలో ఎటువంటి అతిశయోక్తి లేదని తెలియజేశారు. ఇంత మంచి కార్యక్రమాన్ని అమలు చేస్తున్న గౌరవ కలెక్టర్ శ్రీ చెరుకూరి శ్రీధర్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ స్మార్ట్ కిచెన్ నిర్మాణ నిధులు ప్రభుత్వ ఖజానా నుండి కాకుండా దాన గుణ సంపన్నులు, సోషల్ రెస్పాన్సిబిలిటీ గల కొన్ని సంస్థల ద్వారా నిధిని సేకరించి నిర్మించి ఇచ్చిన జిల్లా అధికారులకు జిల్లా వాసిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా నని అన్నారు.. జనసేన నాయకులు శ్రీ అతికారి కృష్ణ గారు మాట్లాడుతూ జనసేన అధ్యక్షులు డిప్యూటీ సీ.ఎం శ్రీ పవన్ కళ్యాణ్ గారు కొన్ని నెలల క్రితం కడప జిల్లాలోని మున్సిపల్ స్కూలును సందర్శించి నప్పుడు వచ్చిన ఆలోచన ఈ స్మార్ట్ కిచెన్ నిర్మాణం అని, కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం మరియు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టిక ఆహారంతో పాటు నాణ్యమైన విద్యను అందించుటలో రాజీ పడని కృషి చేస్తుందని, మండల వాసిగా తన ఊర్లో ఏర్పాటు చేసిన ఈ స్మార్ట్ కిచెన్ కి సహాయపడిన కలెక్టర్ కి,అధికారులకు మరియు దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం మండలం బి.జె.పి అధ్యక్షులు మంగేరి సుబ్రహ్మణ్యం, మండల ప్రధాన కార్యదర్శి శ్రీ కాకర్ల భాస్కర్ రెడ్డి, ఎస్. ఐ. ఆర్ టోలి సభ్యులు మహేశ్వర్ రాజు, ఒంటిమిట్ట సింగల్ విండో చైర్మన్ జయ కృష్ణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బాబి, జనసేన సీనియర్ నాయకులు పసుపులేటి గంగయ్య, విజయ్, మొదలగు బి.జె.పి, టి.డి.పి, జనసేన నాయకులు పాల్గొన్నారు.



# అత్యంత వైభవోపేతంగా ఆడికృత్తిక మహోత్సవం





## - భక్తులతో కిటకిటలాడిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయం

## - గొప్ప ఏర్పాట్లు చేసిన ఆలయ ధర్మకర్తలు రాచపల్లి అనురాధ,సుబ్రహ్మణ్యం

**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లి- నిమ్మనపల్లి రోడ్డు మార్గంలోని వశిష్ట స్కూల్ ఎదురుగా ఆర్ఎస్ నగర్ లో వెలిసి ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో శుక్రవారం ఆడికృతికను పురస్కరించుకొని అంగరంగ వైభవంగా పూజాకార్యక్రమాలు జరిగాయి.ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు రాచపల్లి అనురాధ,సుబ్రహ్మణ్యం దంపతుల ఆధ్వర్యంలో ఎంతో వేడుకగా పూజా కార్యక్రమాలు జరిగాయి. గురువారం ఎంతో ఘనంగా శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో కావళ్ళు వేసుకున్న భక్తులు ఊరేగింపుగా నిర్వహించారు.కావళ్ళు వేసుకున్న వారికి రాచపల్లి సుబ్రమణ్యం దంపతులే అన్నిసౌకర్యాలు కల్పించారు.శుక్రవారం ఉదయం శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఎంతో వేడుకగా పూజాకార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.ఉదయం 5 గంటలకు పంచామృతాభిషేకం,ఆ తర్వాత కృత్తిక [illegible] దర్శనం, భక్తులకు తీర్థప్రసాదాలు ,అన్నదానం నిర్వహించారు.తరువాత సాయంత్రం ప్రాకారోత్సవాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు.ఉదయం నుండి రాత్రి వరకు ఆలయం వద్ద వేలాది మంది భక్తులతో సందడి నెలకొంది.ఎంతో దూరంగా ఉన్న పలని,తిరుత్తని,కొక్కి ఆలయాలకు వెళ్లకుండా మదనపల్లి సమీపంలోనే ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించి భక్తులు వారి మొక్కులను చెల్లించుకున్నారు.ఆలయ ముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.ఆలయం వద్ద అరోహర,వేల మురుగన్ అన్ననినాదాలతో మారుమోగింది.ఆడికృతిక మహోత్సవ వేడుకలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఆలయ ధర్మకర్తలు రాచపల్లి అనురాధ,సుబ్రమణ్యం దంపతులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఇందుకు సహకరించిన వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# 'వారణాసి' వీడియో లీక్..



దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న వారణాసి సినిమాకు లీకుల బెడద ఎక్కువగానే ఉంటున్నది. ఈ సినిమా కోసం భారీ సెట్స్ వేసి.. పకడ్బందీగా సన్నివేశాలు చిత్రీకరిస్తున్నప్పటికీ.. ఈ సినిమా కోసం షూట్ చేస్తున్న కీలక సన్నివేశాలను కొందరు నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టు చేసి లీక్ చేస్తున్నారు. ఈ లీకుల బెడదతో చిత్ర యూనిట్ ఆందోళనకు గురి అవుతున్నట్టు సమాచారం. గతంలో కూడా ఈ సినిమాకు సంబంధించిన కొన్ని ఫోటోలు, వీడియోలు మీడియాలో లీక్ అయ్యాయి. అయితే తాజాగా 20 సెకన్ల నిడివి ఉన్న ఓ సన్నివేశాన్ని కొందరు లీక్ చేయడంతో ఆ విషయం సోషల్ మీడియాలో ట్రెండింగ్గా మారింది. దర్శకుడు రాజమౌళి తన సినిమా షూటింగ్ స్పాట్‌ను అన్ని రకాలుగా దిగ్బంధం చేస్తారు. లోపలి విషయాలు బయటకు పొక్కకుండా సాంకేతికంగా చాలా జాగ్రత్తలు తీసుకొంటారు. సినిమా కోసం పనిచేసే ప్రతీ ఒక్కరి నుంచి లీక్‌లు చేయకుండా అగ్రిమెంట్స్ రాయించుకొంటారు. ఎవ్రైనా విషయాన్ని బయటకు లీక్ చేస్తే చట్టపరమైన చర్యలకు వెనుకాడమనే పాయింట్‌తో కూడిన అగ్రిమెంట్‌పై సంతకాలు కూడా చేయించుకొంటారు. అయినా ఆయన షూటింగ్‌లకు సంబంధించిన లీకుల బెడద తప్పకపోవడం ఆందోళనకరంగా మారింది. వారణాసి సినిమా షూటింగును ఒడిశాలోని ఓ మారుమూల ప్రాంతంలో చిత్రీకరించారు. అయితే కెమెరాకు అందని దూరంలో ఉన్న సన్నివేశాలను షూట్ చేసి వాటిని కొందరు లీక్ చేశారు. ఇక ఈ సినిమా గ్లింప్స్ రిలీజ్ సమయంలో రామోజీ ఫిలిం సిటీలో పకడ్బందీగా ఏర్పాటు చేసిన వేదిక నుంచి దొంగచాటుగా షూట్ చేసి లీక్ చేశారు. గ్లింప్స్‌ను అధికారికంగా రిలీజ్ చేయడానికి ముందే అది సోషల్ మీడియాలో విడుదల కావడం షాకిచ్చింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన 20 సెకన్ల వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నదనే సమాచారం మరోసారి భారీ షాక్‌కు గురి చేసింది. కొందరు ఈ క్లిప్పింగ్ గురించి సోషల్ మీడియాలో మాట్లాడుతూ.. రక్తంతో రాసిన కథ. దానిని సిరాతో ముందుకు తీసుకెళ్లలేం. ముందుకు వెళ్లాలంటే రక్తమే అడుగుతుంది అనే డైలాగ్స్ ఉన్నట్టు నెటిజన్లు షేర్ చేసుకొంటున్నారు. మహేష్ బాబు షర్ట్ లేకుండా.. రక్తంలో తడిచిన వీడియో ఫ్యాన్స్‌కు క్రేజీగా మారినట్టు తెలుస్తున్నది. అయితే ఈ వీడియోను ఎక్కువగా ప్రచారం జరుగకుండా తొలగించే ప్రయత్నాలు వేగవంతం చేసినట్టు తెలిసింది.

# ఓటీటీ లోకి జన నాయగన్



తమిళనాడు ముఖ్యమంత్రి, కోలీవుడ్ సూపర్ స్టార్ దళపతి విజయ్ నటించిన ఆఖరి చిత్రం 'జన నాయగన్' (తెలుగులో 'జన నాయకుడు'). రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో అడుగుపెట్టడానికి ముందు విజయ్ నటించిన సినిమా కావడంతో, మొదటి నుంచి ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. వాస్తవానికి ఈ ఏడాది సంక్రాంతికి విడుదల కావాల్సిన ఈ సినిమా సెన్సార్ వివాదాలు, తదితర కారణాల వల్ల పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు అన్ని అడ్డంకులను దాటుకుని జూలై 23న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదలైంది. మొదటి షో నుంచే మిక్స్‌డ్ టాక్ సొంతం చేసుకున్నప్పటికీ, విజయ్ క్రేజ్ కారణంగా ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద చెప్పుకోదగిన కలెక్షన్స్ రాబట్టింది. ఇప్పుడీ సినిమా ఓటీటీ ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అయింది. 'జన నాయగన్' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'జీ5' ఫ్యాన్సీ రేటుకు దక్కించుకుంది. లేటెస్ట్ రిపోర్ట్స్ మేరకు, ఈ సినిమా ఆగస్టు 21వ తేదీ నుంచి జీ5 లో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. ఒరిజినల్ తమిళ వెర్షన్‌తో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి ఈ చిత్రాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. త్వరలోనే దీనిపై ఓటీటీ సంస్థ నుంచి అధికారిక ప్రకటన రానుంది. మాస్ చిత్రాల దర్శకుడు హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ యాక్షన్ డ్రామాను కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ దాదాపు రూ.500 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, మమితా బైజు ఒక ముఖ్యమైన పాత్రలో ఆకట్టుకుంది. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ పవర్‌ఫుల్ విలన్‌గా మెప్పించారు. వీరితో పాటు ప్రకాష్ రాజ్, ప్రియమణి, గౌతమ్ వాసుదేవ్ మీనన్, నాజర్, నరైన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందించారు.

# విడుదలైన 'ది ప్యారడైజ్' టీజర్

టాలీవుడ్ హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' సినిమా నుంచి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న టీజర్ విడుదలైంది. షూటింగ్ చివరి దశకు చేరుకున్న వేళ వచ్చిన ఈ టీజర్ సోషల్ మీడియాలో మంచి స్పందన అందుకుంటోంది. టీజర్‌లో నాని ఇప్పటివరకు కనిపించని మాస్ లుక్‌లో కనిపించారు. యాక్షన్ సన్నివేశాలు సినిమాపై అంచనాలను మరింత పెంచేలా ఉన్నాయి. చేతి నిండా బ్లేడ్లు పట్టుకుని కనిపించే సన్నివేశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'దిష్టంతా పోవాలే' అంటూ నాని చెప్పిన డైలాగ్ అభిమానులను బాగా ఆకట్టుకుంటోంది. టీజర్‌కు అనిరుధ్ అందించిన నేపథ్య సంగీతం మరో హైలెట్‌గా నిలిచింది. ప్రతి యాక్షన్ సీన్‌కు తగ్గట్టుగా వచ్చిన బీజీఎం టీజర్‌కు మరింత బలం తీసుకొచ్చింది. విజువల్స్ కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ సినిమాలో నాని సరసన కాయాదు లోహర్ కథానాయికగా నటిస్తున్నారు. టీజర్‌కు వస్తున్న స్పందనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'ది ప్యారడైజ్' వచ్చే నెల 24న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.




# కొరియన్ కనకరాజు'కు అదిరిపోయే ఆరంభం

వరుణ్ తేజ్ హీరోగా నటించిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద శుభారంభం చేసింది. వినూత్నమైన ప్రచారంతో విడుదలకు ముందే మంచి హైప్ సంపాదించుకున్న ఈ చిత్రం, ఇప్పుడు బలమైన అడ్వాన్స్ బుకింగ్స్, ప్రీమియర్ షోల నుంచి వచ్చిన మంచి టాక్‌తో మంచి వసూళ్ల దిశగా దూసుకెళతోంది. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ కెరీర్‌కు ఈ సినిమా విజయం అత్యంత కీలకంగా మారింది. సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న ఆసక్తికి అడ్వాన్స్ బుకింగ్స్ అద్దం పట్టాయి. ముఖ్యంగా చివరి 24 గంటల్లో టికెట్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో మాత్రమే సుమారు 33 వేలకు పైగా టికెట్లు అమ్ముడవడం విశేషం. దీనికి తోడు విడుదలకు ముందు రోజు హైదరాబాద్ సహా పలు నగరాల్లో ఏర్పాటు చేసిన పెయిడ్ ప్రీమియర్ షోలకు అద్భుతమైన స్పందన లభించింది. చాలా షోలు హౌస్‌ఫుల్ కాగా, సినిమా చూసిన ప్రేక్షకులు సోషల్ మీడియా వేదికగా ప్రశంసలు కురిపిస్తున్నారు. ముఖ్యంగా వరుణ్ తేజ్ కామెడీ టైమింగ్, ఆయన నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. సినిమాలోని కొన్ని కామెడీ సన్నివేశాలు థియేటర్లలో కడుపుబ్బా నవ్విస్తున్నాయని, హారర్‌తో కూడిన వినోదం బాగా వర్కౌట్ అయిందని పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ వస్తోంది. ప్రమోషన్ల సమయంలో వరుణ్ తేజ్ వ్యక్తం చేసిన ధీమాకు తగ్గట్టుగానే సినిమా ఉందని ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద పెద్ద సినిమాల నుంచి గట్టి పోటీ లేకపోవడం కూడా 'కొరియన్ కనకరాజు'కు కలిసొచ్చే అంశంగా ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ సానుకూల పరిస్థితుల్లో తొలి వారాంతంలో సినిమా భారీ వసూళ్లను నమోదు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మొత్తంగా మంచి బజ్, పాజిటివ్ టాక్‌తో మొదలైన 'కొరియన్ కనకరాజు' వరుణ్ తేజ్‌కు చాలా కాలంగా ఎదురుచూస్తున్న విజయాన్ని అందిస్తుందో లేదో చూడాలి.

# బిగ్ బాస్'లోకి సాధనా నాయుడు!?

బిగ్గెస్ట్ రియాలిటీ షోగా పాపులర్ అయిన 'బిగ్ బాస్' ఇప్పుడు పదో వసంతంలోకి అడుగుపెడుతోంది. ఇప్పటికే తొమ్మిది సీజన్లను అత్యంత విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ రియాలిటీ షో, ఇప్పుడు 'బిగ్ బాస్ 10: దశావతారం' అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు ముస్తాబవుతోంది.ప్రతి సీజన్‌లో సినిమా ప్రమోషన్స్, టాలీవుడ్ తారల సందడితో కోలాహలంగా మారే బిగ్ బాస్ వేదిక, ఈసారి పదింతల వినోదాన్ని పంచేందుకు సిద్ధమైంది. బిగ్ బాస్ 10కు సంబంధించి గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఎన్నో ఊహాగానాలు బయటకొస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈ సారి బిగ్ బాస్ హౌస్ లోకి ఓ హాట్ లేడీ ఎంట్రీ ఇస్తున్నట్లు తెలుస్తోంది.ఆమె పేరు సాధనా నాయుడు. సోషల్ మీడియాలో తన ప్రత్యేకమైన కంటెంట్‌తో గుర్తింపు తెచ్చుకున్న ఇన్‌ఫ్లూయెన్సర్లలో ఈమె ఒకరు. ఫ్యాషన్, బ్యూటీ, లైఫ్‌స్టైల్, ట్రావెల్‌తో పాటు రోజువారీ జీవితానికి సంబంధించిన ఆసక్తికరమైన వీడియోలు, ఫోటోలు పంచుకుంటూ ఆమె సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకున్న ఈ పిల్ల ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి వేదికల్లో సందడి చేస్తుంటుంది.సోషల్ మీడియాలో ట్రెండ్స్‌కు అనుగుణంగా కొత్త తరహా కంటెంట్‌ను అందించడం ఆమె ప్రత్యేకత. అలాగే తన స్టైలిష్ ప్రెజెంటేషన్, ఆకట్టుకునే ఫోటోషూట్లు, ట్రెండింగ్ రీల్స్‌తో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తుంటారు సాధనా నాయుడు. డిజిటల్ క్రియేటర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీకి బిగ్ బాస్ ఆఫర్ వచ్చిందని, అందుకు ఆమె అంగీకారం కూడా ఇచ్చిందని టాక్.ఈ పేరు బయటకు రావడంతో ఆమె ఇన్‌స్టాగ్రామ్ పేజీ కోసం వెతికే జనం అమాంతం పెరిగిపోయారు. ఆ పేజీలో సాధనా నాయుడు ఫొటోస్ చూసి.. సోషల్ మీడియాలోనే ఈ రేంజ్ మసాలా దట్టిస్తోందంటే ఇక బిగ్ బాస్ హౌస్ లో రచ్చే ఉంటుందేమో అని అంతా అంచనా వేస్తున్నారు.



Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma